ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 5 డిసెంబరు 2024 | 5



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మొత్తంగా 9618 మంది ఓటర్లు ఉన్నారు.. ఒక్కో జిల్లా పరిధిలో చూస్తే కాకినాడలోనే అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. అమలాపురంలో పురుష ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోనే ఓటర్లు తక్కువగా ఉన్నారు.

జిల్లా	కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
కాకినాడ	22	1970	1448	3418
తూర్పు	20	1597	1307	2904
కోనసీమ	22	2165	1131	3296



కోటిపల్లికి సీప్లేన్

6లో

కోనసీమ అందాలను తిలకించేలా ప్రాజెక్టు స్థల పరిశీలన చేసిన రామచంద్రపురం ఆర్డీవో బృందం



6లో

పచ్చళ్ల ఖజానా
నార్కెడిమిల్లి

సైబర్ వల

కాకినాడ జిల్లా శంఖవరంలో కాంట్రాక్టర్‌కు టోకరా

7లో

రూ.5.20 లక్షలు కాజేసిన వైనం

అల్లవరంలో వరుస నేరాలు

భూప్రకంపనలు

7లో

పెందుర్తికి కేబినెట్




మా..స్టారెవరో!

నేడే ఎమ్మెల్సీ ఉప పోరు ట మాస్టార్ల చూపు ఎటువైపో

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అంతా సిద్ధమైపోయింది.. గతేడాది పశ్చిమగోదావరి జిల్లా ఉండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఖాళీ ఏర్పడింది. ఆ స్థానానికి ప్రస్తుతం ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థులుగా గంధం నారాయణరావు, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్, నామన వెంకటలక్ష్మి, బొర్రా గోపిమూర్తి పోటీపడుతున్నారు. ఈమేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. బ్యాలెట్ పేపర్లపై ప్రాధాన్యతా క్రమంలో ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకుంటారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఆరు జిల్లాల పరిధిలో 16,737 మంది ఓటర్లు ఉన్నారు. 116 కేంద్రాల్లో పోలింగ్ జరుగుతుంది. ఆరు జిల్లాల పరిధిలో పోలింగ్‌కు సంబంధించిన సామగ్రి బుధవారం పంపిణీ చేశారు. గురువారం పోలింగ్ పూర్తయిన తరువాత ఆరు జిల్లాల పరిధిలో బ్యాలెట్ బాక్సులను కాకినాడ జేఎన్‌టీయూకే స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చనున్నారు. ఈనెల 9వ తేదీన కౌంటింగ్ నిర్వహించి ఫలితం ప్రకటిస్తారు. కౌంటింగ్‌కు సంబంధించి ఏజెంట్ల వివరాలను ఈనెల 7వ తేదీలోపు అందజేయాల్సి ఉంటుంది. 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సహాయ రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు.


- బరిలో ఐదుగురు అభ్యర్థులు
- 8 గంటల నుంచి పోలింగ్
- 6 జిల్లాలు 116 కేంద్రాలు
- 16,737 మంది ఓటర్లు
- బ్యాలెట్ బాక్సుల్లో ఓటింగ్
- కాకినాడలో స్ట్రాంగ్ రూమ్
- 9న అక్కడే కౌంటింగ్
- 12న కోడ్ ముగింపు





కోనసీమలో అంతా ఓకే..

అమలాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 22 మండలాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మండలానికొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. జిల్లాలో అత్యధికంగా అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని సర్వశిక్ష అభియాన్ భవనంలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 60లో 606 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అత్యల్పంగా ఆత్రేయపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటుచేసిన బూత్ నంబరు 52లో 44 మంది ఓటు హక్కు వినియోగించుకుంటారు. పోలింగ్ సామగ్రిని తీసుకుని సాయంత్రానికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం వల్ల పోలింగ్ సిబ్బంది పలు కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బుధవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిబ్బంది చీకట్లోనే సెల్‌ఫోన్ లైట్ల వెలుగులోనే పోలింగ్ ఏర్పాట్లను చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి బుధవారం ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రిని స్వీకరించారు. ప్రత్యేక వాహనాలపై పోలింగ్ సిబ్బంది ఆయా కేంద్రాలకు తరలించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత తిరిగి ఆయా బాక్సులను కాకినాడ జేఎన్‌టీయూకేకు తరలించే బాధ్యతను కొత్తపేట ఆర్డీవో, తహశీల్దార్లకు అప్పగించారు. ఉపాధ్యాయ ఎన్నికకు సంబంధించి 24 మంది ప్రిసైడింగ్ అధికారులు, 24 మంది ఏపీవోలు, 48 మంది ఓపీవోలను నియమించారు. ఏడుగురు రూట్ ఆఫీసర్లు, ఏడుగురు సెక్టోరల్ ఆఫీసర్లతోపాటు మూడు వీడియో బృందాలను ఏర్పాటుచేశారు. ఇక ఎన్నికల నిబంధనను పాటించే విధంగా మండలానికో కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్‌లతోపాటు నాలుగు మునిసిపాలిటీలకు నాలుగు టీములను నియమించారు. కోనసీమ జిల్లాలో 86 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు.



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఒక బూత్ వద్ద అతికించిన అభ్యర్థుల జాబితా

తూర్పున సర్వం సిద్ధం

రాజమహేంద్రవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వంసన్నద్ధం చేశారు. ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సామగ్రి స్వీకరించి తూర్పుగోదావరి జిల్లాలో ఏర్పాటు చేసిన 20 పోలింగ్ కేంద్రాలకు బుధవారం సాయంత్రానికి సిబ్బంది తరలి వెళ్లారు. ఎనిమిది రూట్లలో ప్రత్యేక బస్సుల్లో సిబ్బంది, మెటీరియల్ తీసుకువెళ్లారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని తూర్పుగోదావరి కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. సహాయ రిటర్నింగ్ అధికారిగా డీఆర్వో టి.సీతారామమూర్తి వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్పీ నరసింహ కిషోర్ స్వీయ పర్యవేక్షణలో బందోబస్తు పూర్తి ఏర్పాట్లుచేశారు. ప్రత్యేక బస్సుల్లో పోలీసులు ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, సీఐలు 16, ఎస్‌ఐలు 41, ఏఎస్‌ఐ 69, కానిస్టేబుళ్లు 138, మహిళా కానిస్టేబుళ్లు 34, హోంగార్డులు 38, 19 మందితో రెండు స్పెషల్ పార్టీలు కలిపి మొత్తం 364 మందితో బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎస్పీ పేర్కొన్నారు. సిబ్బంది తరలింపును రాజమహేంద్రవరం, కొవ్వూరు ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, తహశీల్దార్ పాపారావు, ఎన్నికల సూపరింటెండెంట్ దేవి, డీటీ శాస్త్రి తదితరులు పర్యవేక్షించారు.

కలెక్టర్ పరిశీలన..

కొవ్వూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుదవారం పరిశీలించి అధికారులకు సూచనలు అందజేశారు. ఓటర్ల జాబితా అనుసరించి ఓటర్లను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, పోలింగ్ ఏజెంట్లకు జారీచేసిన గుర్తింపుకార్డులను పరిశీలించడం, తగిన సిట్టింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొవ్వూరు మండలం లోని 231 మంది ఓటర్లు ఉన్నారు. ఎంపీడీవో కా ర్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎంపీడీవో కె.సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.



ఓడంతా.. జల్లెడ

కాకినాడలో నడిసముద్రంలో ఉన్న స్టెల్లా నౌకలో రేషన్ బియ్యం అసలు ఎంత ఉంది? అనేది తేల్చడం అధికారులకు తలనొప్పిగా మారింది. 189.99 మీటర్ల పొడవున్న స్టెల్లా నౌకలో అయిదు హేచ్‌ల్లో ఇప్పటివరకు 32,416మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్ జరిగింది. ఈ బియ్యాన్ని బస్తాల్లో కొలిస్తే దాదాపు 12.80 లక్షల బస్తాలు. వీటిలో రేషన్ బియ్యం ఎంతనేది గుర్తించడం కష్టంగా మారుతోంది. అయినా అతికష్టంపై అధికారుల బృందం బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏకబిగిన తనిఖీలు చేసి శాంపిళ్లు సేకరించారు. వీటిని ల్యాబ్‌కు పంపి రేషన్ బియ్యం ఉన్నాయా? లేదా? అనేది నిర్ధారించనున్నారు. ఫలితాల ఆధారంగా రేషన్ బియ్యం బస్తాలను ఏంచేయాలి? నౌకను ఎప్పుడు కదలడానికి అనుమతి ఇవ్వాలి అనేది తేల్చనున్నారు. అయితే సముద్రంలో వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఇంకా లోడింగ్ చాలావరకు చేయాల్సి ఉండడంతో పారా బాయిల్డ్ రైస్‌ను నౌకలోకి గురువారం నుంచి లోడింగ్ మొదలు పెట్టనున్నారు.

- స్టెల్లా నౌకలో లోడైన రేషన్ బియ్యం అసలెంత
- నిగ్గుతేల్చడానికి శాంపిళ్లు సేకరించిన అధికారుల బృందం
- భారీ నౌకలో ఒక్కోటి 40 అడుగుల లోతులో అయిదు హేచ్‌లు
- వీటిలో ఇప్పటికే ఒక్కో హేచ్‌లో 14అడుగుల ఎత్తులో బియ్యం బస్తాలు లోడ్
- నౌకలో అయిదు హేచ్‌ల్లో ఇప్పటివరకు 12లక్షల బియ్యం బస్తాలు లోడింగ్
- రేషన్ బియ్యం అనుమానం ఉన్న ఒకటో హేచ్‌లో 4.10 లక్షల ప్యాకెట్లు
- వీటిని అడుగు వరకు తొలగించి శాంపిళ్లు తీయడం అసాధ్యమే
- అయినా తీసిన శాంపిళ్లలో రేషన్ బియ్యం ఆనవాళ్లు నేటికి తేలనున్న వైనం
- తద్వారా బియ్యం సీజ్‌పైనా, నౌక కదలికపైనా స్పష్టత
- ఉదయం పదిన్నర నుంచి రాత్రి వరకు నౌకపై కొనసాగిన తనిఖీలు
- మరోపక్క బియ్యం లోడింగ్ పూర్తవక నౌక సిబ్బందిలో అయోమయం

(ఆంధ్రజ్యోతి-కాకినాడ/కలెక్టరేట్)

పనామా దేశానికి చెందిన స్టెల్లా ఎల్ నౌక కాకినాడ యాంకరేజ్ పోర్టుకు గత నెల 12న బియ్యం లోడింగ్‌కు వచ్చింది. ఇందులో సరుకు లోడింగ్ పూర్తిచేసుకుని తిరిగి ఇక్కడి నుంచి పశ్చిమాఫ్రికా దేశానికి వెళ్లాల్సి ఉంది. అందులో భాగంగా గత నెల 29 నాటికి 33,400 మెట్రిక్ టన్నుల బియ్యం నౌకలోకి ఎక్కించారు. అయితే ఈలోపు ఎగుమతి అయిన సరుకులో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా అవుతోందని సమాచారం రావడంతో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ నేరుగా నౌక వద్దకు వెళ్లి తనిఖీలు చేశారు. అందులో లోడయిన బియ్యంలో 640 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ బియ్యంగా గుర్తించి మిగిలిన బియ్యం నౌకలోకి పంపకుండా నిలిపివేశారు. ఈలోపు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడకు వచ్చి రేషన్ బియ్యం ఉన్న నౌకను సీజ్ చేయాలని ఆదేశించారు. ఈలోపు తుఫాను ముప్పు రావడంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. దీంతో బియ్యం ఎగుమతులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అయితే ఇప్పుడు వాతావరణం అనుకూలంగా ఉండడంతో నౌకలోకి తిరిగి బియ్యం లోడ్ చేసి దాన్ని పశ్చిమాఫ్రికాకు పంపడానికి అనుమతి ఇవ్వాల్సి ఉంది. లేకపోతే డెమరేజీ భారంతోపాటు నౌకను ఆపారన్న వివాదం పెరిగే ప్రమాదం ఏర్పడింది. అటు పౌర సరఫరాలశాఖ సైతం అడ్మిరాలిటీ న్యాయస్థానంలో కేసు వేసినా నౌకను సీజ్ చేయించడం అసాధ్యమని గుర్తించింది. దీంతో నౌకను పంపేయాల్సిన పరిస్థితులు రావడంతో ఇప్పటివరకు లోడ్ అయిన 33,400 మెట్రిక్ టన్నుల బియ్యంలో అసలు రేషన్ బియ్యం ఎంతనేది నిర్ధారించి నిర్ణయం తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కస్టమ్స్, రెవెన్యూ, పోర్టు తదితర విభాగాలతో కూడిన పది మంది అధికారుల బృందంతో నౌకలో బియ్యం తనిఖీలు చేసి శాంపిళ్లు సేకరించడానికి పంపాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. దీంతో బుధవారం వీరంతా నౌక వద్దకు చేరుకుని తనిఖీలు చేసి శాంపిళ్లు తీసుకున్నారు.

గుర్తించడం సాధ్యమేనా...

అయితే లోడైన బియ్యంలో అధికారులు తనిఖీలు చేసి శాంపిళ్లు సేకరించినా అందులో అసలు ఎంత రేషన్ బియ్యం ఉందనేది తేల్చడం కష్టంగానే మారింది. గత జూన్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని వ్యాపారులు న్యాయస్థానం ద్వారా బ్యాంకు గ్యారెంటీ ఇచ్చి విడిపించుకున్న బియ్యం, నౌకలో గుర్తించిన రేషన్ బియ్యం ఒకటాకాదా అనేది ప్రధానంగా తేల్చబోతున్నారు. అయితే నౌకలోకి వెళ్లిన తర్వాత అక్కడ బియ్యం బస్తాలను చూసి అధికారులు కళ్లు తేలేసిన పరిస్థితి. పనామా నౌక చాలా భారీ షిప్. ఇందులో మొత్తం అయిదు హేచ్‌లు (ఒక్కోటి 40 అడుగుల లోతులో ఉండే గొడౌన్‌లు) ఉన్నాయి. అన్ని హేచ్‌లు కలిపి ఇప్పటి వరకు 33,400 టన్నుల బియ్యం లోడ్ చేశారు. బస్తాల ప్రకారం చెప్పాలంటే మొత్తం అన్నింట్లో కలిపి 12 లక్షల బస్తాలన్నమాట. ఇందులో హేచ్1లో లోడైన 9,400 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రకారం బస్తాలు 4.10 లక్షలున్నాయి. ఇందులో ద్వారంపూడి వీరభద్రారెడ్డి కంపెనీ అయిన మానస 4,400 మెట్రిక్ టన్నులు, శ్రీ సుముఖ వీరేశ్వర్ కంపెనీ వెయ్యి టన్నులు, శ్వాన్‌చిత్ర కంపెనీ 4 వేల మెట్రిక్ టన్నుల బియ్యం లోడ్ చేసింది. ప్రస్తుతం ఈ హేచ్‌లో అడుగు నుంచి 15అడుగుల ఎత్తులో బస్తాలను పేర్చారు. ఇప్పుడు అధికారులు పైన ఉన్న బస్తాల్లో రేషన్ బియ్యం ఉన్నాయో లేవో తనిఖీ చేసి శాంపిళ్లు తీసుకున్నారు. కానీ వెంట హమాలీలు లేకపోవడం కూడా వీరికి ఇబ్బంది ఉంది. దీంతో 15 అడుగుల కిందనున్న బస్తాలు తీయడం అసాధ్యంగా మారింది. అటు మిగిలిన హేచ్‌ల్లో సైతం బియ్యం బస్తాల్లో గుచ్చి శాంపిళ్లు సేకరించారు. ప్రధానంగా ఈ బియ్యం బస్తాలన్నీ వైట్ లిల్లీ అనే బ్రాండ్ పేరుతో ఉన్నాయి. మరోపక్క శాంపిళ్లను సేకరించి బుధవారం రాత్రి ల్యాబ్‌కు పంపారు. కాగా నౌకలో బియ్యం లోడింగ్ భారీగా జరగాల్సి ఉండడంతో నౌక ఎప్పుడు కదులుతుందో తెలియక అందులో సిబ్బంది అయోమయంతో కనిపించారు.



స్టెల్లా ఎల్ నౌకను తనిఖీ చేస్తున్న రెవెన్యూ, కస్టమ్స్, పోర్టు అధికారులు

చెక్‌పోస్టుల్లో జేసీ తనిఖీలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో ఉన్న చెక్‌పోస్టులను కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రధానంగా బొంబాయి గేటు, శక్తి గ్యాస్ గేటు వద్ద ఉన్న చెక్‌పోస్టులను తనిఖీచేశారు. ప్రతి లారీలో ఉన్న బియ్యం లోడ్‌లను తనిఖీ చేయాలని అక్కడి అధికారులను ఆయన ఆదేశించారు. రోజుకు ఎన్ని లారీలు వెళుతున్నాయి, వాటిని ఎలా తనిఖీలు చేస్తున్నారు, శాంపిల్స్ ఎలా భద్రపర్చుతున్నారు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.



డీప్ వాటర్ పోర్టు సమీపంలో సముద్ర తీరంలో కట్టేసిన శ్రీలంక బోట్లు

పట్టుబడ్డ శ్రీలంక బోట్లు ఇలా..

కాకినాడ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్ర జలాల్లో అక్రమంగా ప్రవేశించి పట్టుబడడంతో తీరంలో కట్టేసిన శ్రీలంక బోట్లు అవసాన దశకు చేరుతున్నాయి. వరుస తుఫాన్ల వల్ల కురిసిన భారీ వర్షాలకు డీప్ వాటర్ పోర్టు సమీపాన కట్టేసిన ఈ బోట్లు నీటిలో ఒక పక్కకు మునిగిపోయాయి. ఈ బోట్లను తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో సముద్ర జలాల్లో మరుగున పడనున్నాయి.

జిల్లాలో రైస్ మిల్లులపై దాడులు

పీడీఎస్ బియ్యమే లక్ష్యంగా తనిఖీలు..

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో బుధవారం రైస్‌మిల్లులపై దాడులు జరిగాయి. సివిల్ సప్లయిస్, పోలీసు, రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు నిర్వహించారు. తుని, పెదపూడి, కత్తిపూడి, రాజుపూడి, జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో మిల్లులను తనిఖీలు చేశారు. ప్రధానంగా పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్, పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి నిల్వ చేయడం వంటి వాటిపై తనిఖీలు చేశారు. అమరావతి నుంచి ఉన్నతాధికార్ల ఆదేశాల మేరకు రైస్‌మిల్లుల్లో బియ్యం నిల్వలపై జల్లెడ పడుతున్నారు. ఏ రైస్‌మిల్లులోనైనా ఒక్క బస్తా పీడీఎస్ బియ్యం దొరికినా మిల్లుపై కఠిన చర్యలు తీసుకోవడానికి అధికార బృందాలు సిద్ధం అయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా రైస్‌మిల్లుల్లో అనధికారికంగా పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జేసీ తెలిపారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో పిల్లి రమేష్

ప్రశాంతంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలో ప్రశాంతంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యనభ్యసించే 3, 6, 9వ తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, ఉపాధ్యాయులు బోధన సామర్థ్యాలు ఎలా ఉన్నాయనే దానిపై సమాచారం పొందేందుకు ఎన్‌ఏఎస్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. కాకినాడ రూరల్ తమ్మవరం, కాకినాడ సాలిపేట మున్సిపల్ బాలికల హైస్కూల్స్‌లో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. డిస్ట్రిక్ట్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ బోర్డు వెంకట్రావు పాల్గొన్నారు.

నోరూరించే పచ్చళ్ల ఖజానా

నార్కెడిమిల్లి

ఊరంతా పచ్చళ్ల వ్యాపారస్తులే.. దేశమంతా విక్రయం.. 15 రకాల పచ్చళ్ల తయారీ









(ఆంధ్రజ్యోతి/ఆత్రేయపురం)

గోదారోళ్లంటే వెటకారంతోపాటు మమకారం ఉంటుందంటారు.. మమకారంతోపాటు ఘాటైన పచ్చళ్లతోనూ నోరూరిస్తుంటారు. ఈ పచ్చళ్లు ఇంట్లో పెట్టుకోవడం మామూలే. కానీ ఒక ఊరంతటికీ పచ్చళ్లు పట్టడమే జీవనోపాధి. ఊళ్లో చాలామంది ఆడవాళ్లు ఈ పచ్చళ్లు పట్టడంలో ఉపాధి పొందుతుంటే, ఈ పచ్చళ్లను దేశవ్యాప్తంగా మార్కెటింగ్ చేస్తూ మగవాళ్లు బిజీగా ఉంటారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి ఊరంతా పచ్చడి వ్యాపారులే. గోదావరి చెంతనే పచ్చని తివాచి పరిచినట్టుంటే కోనసీమ గ్రామాల్లో ఒకటి ఈ నార్కెడిమిల్లి. గ్రామ జనాభా నాలుగు వేలు. సుమారు 400 కుటుంబాలు కలిగిన ఈ నార్కెడిమిల్లిలో ప్రతి గడపలోనూ పచ్చళ్లు తయారు చేస్తున్న దృశ్యాలే కనిపిస్తాయి. పూటగడవడానికి కష్టంగా ఉన్న రోజుల నుంచి నేడు కుటీర పరిశ్రమగా ఎదిగి ఊరంతా ఇలా పచ్చళ్ల వ్యాపారం సాగిస్తు న్నారు. సుమారు 15 రకాల పచ్చళ్లను తయారు చేస్తూ పచ్చడి ప్రియులకు రుచి చూపిస్తున్నారు.

దేశనలుమూలలకూ పచ్చడి రుచులు

నార్కెడిమిల్లి గ్రామంలో తయారు చేస్తున్న పచ్చళ్లను దేశనలుమూలలకు తీసుకుని వెళ్లి ఇక్కడి వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. ఇళ్ల వద్ద కుటీర పరిశ్రమగా పచ్చళ్లను తయారు చేస్తూ ముడిసరుకును వివిధ రాష్ట్రాలకు తీసుకునివెళ్లి మోటార్ సైకిళ్ల ద్వారా ఆయా ప్రాంతాల్లో అమ్మకాలు సాగిస్తారు. పూర్వం సైకిళ్లు, కావిళ్లతో వెళ్లి విక్రయించేవారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు, బళ్లారి, రాయదుర్గం, రాయచూర్, తమిళనాడులోని చెన్నై, శేలం, కొయంబత్తూర్, ఒడిషాలోని వివిధ జిల్లాలతోపాటు ఆంధ్ర, తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో ఈ పచ్చళ్ల వ్యాపారం సాగిస్తున్నారు. వేసవి సీజన్‌లో మామిడి, మాగాయి వంటి పచ్చళ్లను తయారు చేసి కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచుతారు. మూడు నెలలకోసారి తయారుచేసిన పచ్చళ్లను తీసుకుని ఆయా రాష్ట్రాల్లో అమ్మకాలు సాగిస్తారు. ఈ గ్రామం నుంచి వేరే గ్రామానికి కొందరు మహిళలు వెళ్లి పచ్చళ్లు తయారు చేస్తున్నారు. అంకంపాలెం, ర్యాలి, లొల్ల, ఆత్రేయపురం, ఉచ్చిలి, వెలిచేరు గ్రామాల్లో వివిధ రకాల పచ్చళ్ల తయారీ పెద్దఎత్తున జరుగుతోంది. ఇలా పచ్చళ్ల వ్యాపారంతో గ్రామీణులు ఉపాధి పొందుతున్నారు.



ఇక్కడ తయారు చేస్తున్న పచ్చళ్లు...

మామిడి, మాగాయి, నిమ్మకాయ, ఎండుమిర్చి, టమోట, అల్లం, గోంగుర, ఉసిరి, కాకరకాయ, దబ్బకాయ, కరివేపాకు, కొత్తిమీర, మిక్సిడ్ పచ్చళ్లను తయారుచేయడంలో నార్కెడిమిల్లి వాసులది అందివేసిన చెయ్యి. మహిళలు ఈ పచ్చళ్ల తయారీలో నిమగ్నమై ఉంటారు. మగవాళ్లు వివిధ రాష్ట్రాల్లో అమ్మకాలు సాగిస్తుంటారు. మూడు నెలలకోసారి వచ్చి పచ్చళ్లకు సంబంధించిన ముడి సరుకును వ్యాన్ల ద్వారా తరలిస్తూ ఎప్పటికప్పుడు కలుపుకుని అమ్మకాలు సాగిస్తారు. ఎన్నికలు, పండుగల సమయాల్లోనే వలస వెళ్లిన వ్యాపారులు గ్రామంలో ప్రత్యక్షమై సందడి చేస్తారు.



కోటిపల్లికి సీప్లేన్

కోనసీమ అందాలను తిలకించేలా ప్రాజెక్టు

స్థల పరిశీలన చేసిన రామచంద్రపురం ఆర్డీవో బృందం


స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో తదితరులు

కె.గంగవరం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ తీరంలో పర్యాటకానికి మరింత శోభను తెచ్చేలా సీప్లేన్ (వాటర్ డ్రోమ్) యాత్రను అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కోనసీమ అందాలను సంపూర్ణంగా తిలకించేలా ఈ పర్యాటక ప్రాజెక్టును రూపొందించాలనే యోచనలో ఉన్నారు. ఈ సీప్లేన్ ఎక్కడ నుంచి ఏర్పాటుచేయాలనే దానిపై కసరత్తు కూడా మొదలైంది. ఇందుకు స్థల పరిశీలన నిమిత్తం రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల ఆధ్వర్యంలో అధికారుల బృందం మండల పరిధిలోని కూళ్ల, కోటిపల్లి, కోట గ్రామాల్లో ఏటిగట్టు ప్రాంతాల్లో పరిశీలన చేసింది. ఇటీవల కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకూ నడిచిన ఒక సీప్లేన్ (ఎయిరోడ్రోమ్ అవసరం లేకుండా నీటిపై నిలిచే వాహనం) విజయవంతంగా నడిచిన విషయం విదితమే. దీంతో ఇలాంటి ప్రాజెక్టును ఇక్కడ కూడా ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. గౌతమీ గోదావరి నది ఎడమగట్టు కోటిపల్లి నుంచి కోనసీమ అయినవిల్లి, అంతర్వేది తదితర క్షేత్రాలను కలుపుతూ ఈ సీప్లేన్ ప్రాజెక్టును ఏర్పాటుచేస్తే, ఈ ప్రాంతంలో పర్యాటకానికి మరింత చేయూతనిచ్చినట్టు అవుతుందని భావిస్తున్నారు. దీనిలో భాగంగా రామచంద్రపురం ఆర్డీవో అఖిల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారుల బృందం ఏటిగట్టు ప్రాంతంలో పర్యటించి స్థల పరిశీలన చేశారు.

ఏపీటీలో ముగిసిన పాలీటెక్‌ఫెస్ట్

ప్రథమ విజేతగా బీవీసీ విద్యార్థుల ఏఐ సాంకేతిక ప్రదర్శన

కాకినాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏపీటీలో రెండు రోజులపాటూ నిర్వహించిన ప్రాంతీయ పాలీటెక్‌ఫెస్ట్ -2024 బుధవారం ముగిసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జనార్ధనరావు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాకినాడ రహదారులు, భవనాలశాఖ ఎస్ఈ జి.కాంతు, గౌరవ అతిథిగా రాజమహేంద్రవరం జీఎమ్మార్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు పాల్గొన్నారన్నారు. కాంతు మాట్లాడుతూ జీవితంలో సానుకూల దృక్పథాన్ని అలవాటుచేసుకోవాలని, స్థిత ప్రజ్ఞత ప్రదర్శించాలని సూచించారు. సాంకేతిక విద్యా శాఖ, ఏపీప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 297 మంది తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలు ప్రతీ ప్రాజెక్టును సందర్శించి మూల్యాంకనం చేశారు. ప్రభుత్వ ఐటీఐ, ప్రభుత్వ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలకు, సమీపంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సమారు 4000మంది ప్రదర్శనలను తిలకించారు. మొదటి 20 స్థానాల్లో నిలిచిన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన బీవీసీ విద్యార్థులు అనిల్‌బాబు, విష్ణుతేజల ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ప్రదర్శనకు రూ.25,000.. రెండోస్థానంలో నిలిచిన ఆదిత్య కళాశాల విద్యార్థుల ప్రదర్శనకు రూ.10,000 నగదు బహుమతులను చెక్‌రూపంలో అతిథుల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రథమ విజేతకు నగదు బహుమతిని చెక్‌రూపంలో అందజేస్తున్న అతిథులు

తునిలో 'వైశ్యరాజు జ్యూయలర్స్' ప్రారంభం

తుని రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణంలోని పెంటకోట రోడ్డులో వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూమ్ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి నిర్వాహకులతో కలిసి షోరూమ్‌ను ప్రారంభించి జ్యోతిప్రజ్వలన చేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చెక్కా సూర్యనారాయణ మొదటి బంగారు ఆభరణం కొనుగోలుతో అమ్మకాలను లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో తమ మొదటి షోరూమ్‌ను తునిలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వినూత్నమైన కలెక్షన్ల ఆఫర్‌గా అన్ని రకాల బంగారు ఆభరణాలను ఫ్లాట్ ఆరు శాతానికే విక్రయిస్తామన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదని, వినియోగదారుల తరపున జీఎస్టీ తామే చెల్లిస్తామన్నారు. కిలో వెండి వస్తువుల కొనుగోలుపై రూ.10వేలు వరకు తగ్గిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫాల్గుణరాజు, డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌లతో పాటు చెక్కా రమేష్, గోగుల కోటేశ్వరరావు, కోలా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు కొనుగోలుదారులనుఆకట్టుకున్నాయి.


తునిలో వైశ్యరాజు జ్యూయలర్స్ ప్రారంభోత్సవం అనంతరం నిర్వాహకులు

ఘనంగా ఘంటసాల జయంతి


ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించిన చాగంటి కోటేశ్వరరావు, ఘంటసాల కోడలు కృష్ణకుమారి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాన గాంధర్వుడు శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని బుధవారం కాకినాడ రూరల్ తిమ్మాపురం ఆకొండి లక్ష్మీ స్మారక గోశాల ప్రాంగణంలో ధర్మవర్ధిని ట్రస్ట్, శ్రీచాగంటి సత్సంగంల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి బ్రహ్మర్షిస్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వేల్యూస్ అడ్వైజరీ సభ్యులు డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు, ఘంటసాల కోడలు కృష్ణకుమారి, డాక్టర్ కే.వరప్రసాద రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఘంటసాలను ఉద్దేశించి చాగంటి ప్రసంగించారు. ఘంటసాల సన్నివేశాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాత భావప్రకటనతో పాడేవారన్నారు. ఆణిముత్యాలు లాంటి ఎన్నో పాటలతో ప్రేక్షకులను రంజింపచేసిన గొప్ప గానగాంధర్వుడు ఘంటసాల అన్నారు. భలే మంచిరోజు, శిలలపై శిల్పాలు చెక్కినారు, హిమగిరి సొగసులు, మనసున మనసై, తెలుగువీర లేవరా వంటి ఎన్నో ప్రజాదరణ పొందిన పాటలు పాడారన్నారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేస్తూ మృతి చెందిన పొట్టి శ్రీరాములు శవయాత్రలో పాల్గొని దేశభక్తి పాటలు పాడిన మహనీయుడన్నారు. అనంతరం ఘంటసాల గానంలో మానస పత్రులు హైదరాబాద్‌కు చెందిన గాయకులు శరచ్చంద్ర, చంద్రతేజ ఘంటసాల గాత్రంతో వినసొంపైన పాటలతో మైమరిపించారు. ఘంటసాల సంగీత విభావరి ఆకట్టుకుంది.

ధవళేశ్వరంలో...

ధవళేశ్వరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోదావరి కల్చరల్ అసోసియేషన్, రాకా సంస్థ సంయుక్తంగా పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ధవళేశ్వరం ఇరిగేషన్ పార్కులో గల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బరాజు ఫౌండేషన్ డైరెక్టర్ గాలి సుబ్బరాజు మాట్లాడుతూ భగవద్గీతను శ్రావ్యంగా ఆలపించిన ఘంటసాల తెలుగు ప్రజల మనుస్సులో చిరస్థాయిగా నిలిచిన ధన్యజీవి అని కొనియాడారు. గోదావరి కల్చరల్ క్లబ్ అధ్యక్షుడు జీవీ రమణ, సహ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు మాట్లాడుతూ ఘంటసాలకు భారతరత్న పురస్కారం ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, రాజేశ్వరరావు, ఏపీఎన్జీవో యూనిట్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, వేగిశెట్టి కోదండ రామారావు, జీవీఆర్ జగన్నాథం, పీఎస్ శేషకుమార్, బి.రామకృష్ణ, కేఎస్ గౌరీశంకర్, ఎం.రమేష్, గాదిరాజురామరాజు, గాయకుడు దేవకుమార్ ఘంటసాల విగ్రహానికి ఘన నివాళులర్పించారు.


ధవళేశ్వరంలో ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు






పాఠశాలలో పిల్లలకు ఆరోగ్య విషయాల కరపత్రాలు, పుస్తకాలు అందిస్తున్న పీవీవీ సత్యనారాయణ.. ముమ్మిడివరం భవిత కేంద్రంలో పిల్లలకు పండ్లు, బలవర్ధకమైన ఆహారం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

అందరూ హాయిగా ఉండాలి...

» 40 ఏళ్లుగా సేవా కార్యక్రమాల్లో ఓ మాస్టారు నిర్విరామ కృషి

» సొంత సొమ్ములతో ఆరోగ్య సూత్రాలపై ప్రచారం

(ఆంధ్రజ్యోతి/ముమ్మిడివరం)

ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన, విశ్రాంత జీవనాన్ని గడిపేందుకు చాలామంది ఇష్టపడతారు. కానీ ఈయనకు విశ్రాంతి ఇష్టముండదు. అటు ఉద్యోగిగాను, ఇటు ఉద్యోగ విరమణ తరువాత కూడా సామాజిక సేవే లక్ష్యంగా జీవనం సాగిస్తున్నారు ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన పితాని వీర వెంకట సత్యనారాయణ. 37 ఏళ్లు ఉపాధ్యాయుడిగా సేవలందించారు. అలాగే 1984 నుంచి సుమారు 40 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఇప్పుడు 79 ఏళ్ల వయసులోనూ సామాజిక సేవల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఎవరూ అనారోగ్యంపాలు కాకూడదనే ఆయన ఆశయం పాఠశాలలో చదువుకునే రోజుల్లోను, ఏజెన్సీలో ఉద్యోగాలు చేసే సమయంలో అనారోగ్యానికి పాలై తాను పడ్డ కష్టాల ఉంచి ఆయనకు ప్రేరణ కలిగింది. రోగాల బారిన పడి ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకుని కష్టాలు పడే కంటే ఆరోగ్య సూత్రాలు పాటించడం ద్వారా రోగాలను పారదోలవచ్చుననేది ఆయన దృక్పథం. 2005 వరకు ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన సమయంలోను, రిటైర్డ్ అయిన తరువాత వచ్చే పెన్షన్ సొమ్ములో ఆయా సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తూ వస్తున్నారు. 'హాయిగా ఉండాలంటే' పేరిట 4460 ఆరోగ్య సూత్రాలతో కూడిన 2500 పుస్తకాలను ముద్రింపజేశారు. హాయిగా ఉండాలంటే 57 సూత్రాల కరపత్రాలను, దురలవాట్లకు దూరంగా ఉండండి, యోగాసనాలు వేస్తే రోగాలు పారిపోతాయి, సరదాగా సిగరెట్ కాలిస్తే, భయంకరమైన ఎయిడ్స్ వ్యాధి, మత్తు కోసం సారా తాగితే వంటి శీర్షికలతో 3 లక్షలకు పైగా కరపత్రాలు ముద్రించి బస్సులు, పాఠశాలల్లో సైన్స్‌ఫేర్, ట్రైనింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల సమావేశాల్లోను పంపిణీచేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. విద్యను ప్రోత్సహించాలనే సంకల్పంతో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. జడ్పీ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు మొదటి ఆరు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఇంగ్లీషు, తెలుగు, గ్రామర్ పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, తెలుగు, ఇంగ్లీషు డిక్షనరీలు, ఆరోగ్య సూత్రాల పుస్తకాలు అందిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతిని కూడా అందిస్తున్నారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో, ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలల విద్యార్థులకు, ముమ్మిడివరంలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పండ్లు, బ్రెడ్డు వంటివి అందిస్తున్నారు. పాఠశాలలో యోగాసనాలువేసి విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు, యోగాపై అవగాహన కల్పిస్తున్నారు. పలు పాఠశాలలకు అవసరమైన వస్తు సామగ్రిని కూడా సమకూర్చారు. వీరవెంకటసత్యనారాయణకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో ఇద్దరు కుమారులు ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. వారు కూడా తండ్రి చేసే సేవా కార్యక్రమాలకు కొంత ఆర్థిక సహకారం అందిస్తుంటారు. 1996 తుఫాను, 2006 వరదలకు నష్టపోయిన వారికి ఆర్థికసాయం అందించడంతోపాటు బియ్యం, దుస్తులు, వంట సామగ్రి వంటివి పంపిణీ చేశారు. 2019 కరోనా సమయంలో కోడిగుడ్లు, పండ్లు, నిమ్మకాయలు, వెల్లుల్లిపాయలు వంటి పోషక విలువల కిట్లను ఇంటింటికీ పంపిణీ చేశారు. ముగ్గురు దివ్యాంగులకు నెలకు రూ.300 వంతున పింఛను అందిస్తున్నారు. మాస్టారు సేవా నిరతిని దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎం సీ బాలయోగి 2004లో తూర్పుగోదావరి కలెక్టర్‌గా పనిచేసిన కేఎస్ జవహర్‌రెడ్డి, ఇతర ప్రముఖులు సత్కరించి పురస్కారాన్ని అందించారు.


కొవిడ్ సమయంలో పోషక విలువల కిట్లు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

వైభవంగా మహాయాగం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి ఆధ్వర్యంలో శ్రీరామ పాదకా పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు బుధవారం కాకినాడ జేఎన్‌టీయూకే ఎదురుగా గల ప్రాంగణంలో శ్రీరామ సేవాసమితి, వికాస తరంగిణి, శ్రీవారాహీ చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో విశ్వశాంతి శ్రీయాగ సహిత సుదర్శన నారసింహ యాగంలో భాగంగా వైభవంగా మహాయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అగ్ని ప్రతిష్ఠ, యాగశాల ప్రవేశం, చతుస్థానార్చన, శాంతిపాఠం, వేదాదివిన్నపాలు, శ్రీ విష్వక్సేన సంతాన హోమాన్ని పలు రకాల విశేష ద్రవ్యాలతో వైభవంగా నిర్వహించారు. విశ్వశాంతిని కోరుకుందామంటూ చినజీయర్‌స్వామి అనుగ్రహ పారాయణచేశారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. రాధికా ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సంగీత విభావరి ఆకట్టుకుంది.


మహాయాగంలో పాల్గొన్న చినజీయర్ స్వామి

శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో..

3 రోజులపాటు అంతరాలయ దర్శనాల నిలిపివేత

17,18,19 తేదీల్లో మరమ్మతులు

పిఠాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో ఈనెల 17,18,19వ తేదిల్లో అంతరాలయం, పాదుక, త్రిమూర్తుల(శ్రీపాద వల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి) దర్శనాలను నిలిపివేయనున్నారు. అంతరాలయం మరమ్మతుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు. ఈ 3రోజులు శ్రీపాదశ్రీవల్లభ స్వామి ఉత్సవమూర్తులకు పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. మహాసంస్థానానికి వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

7న ఉమ్మడి జిల్లా, కోకనాడ టౌన్ ప్రయాణికుల సంఘం సమావేశం

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా, కోకనాడ టౌన్ ప్రయాణికుల సంఘం సమావేశం ఈనెల 7వతేదీ శనివారం సాయంత్రం 4గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసు వెనుక వెంకటరత్నపురంలోని గాంధీ భవన్‌లో సంస్థ అధ్యక్షుడు వైడీ రామారావు అధ్యక్షతన జరగనుంది. రైల్వేలు, రోడ్డు ప్రయాణికుల స మస్యలు, మౌలిక వసతుల అభివృద్ధి, భవిష్య త్తు కార్యక్రమాలపై చర్చించడానికి జరిగే ఈ సమావేశంలో సంఘ సభ్యులతో పాటు ఆసక్తి కలిగిన ప్రజలు అందరూ పాల్గొనాలన్నారు.

ప్రజలపై 'సైబర్' వల

- కాకినాడ జిల్లా శంఖవరంలో కాంట్రాక్టర్‌కు టోకరా
- తక్కువ రేటుకు సిమెంట్ అమ్మకం అని నమ్మబలికి రూ.5లక్షల20వేల నగదు వేయించుకుని.. ఫోన్ ఆఫ్
- అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు

శంఖవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ అత్యాశను ఆసరాగా తీసుకుని ఓ సైబర్ నేరగాడు మోసం చేశారు. కాకినాడ జిల్లా శంఖవరానికి చెందిన కాంట్రాక్టర్ ఖాతా నుంచి ఏకంగా రూ.5లక్షల20వేలు కాజేశాడు. దీనిపై అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అన్నవరం ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. శంఖవరం గ్రామానికి చెందిన వెన్నా వీరవెంకట సత్యనారాయణ సివిల్ కాంట్రాక్టరుగా రోడ్డు పనులు నిర్వహిస్తుంటాడు. సిమెంట్ తక్కువ ధరకు ఎక్కడ లభ్యమవుతుందోనని ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశాడు. ఇది గమనించిన సైబర్ నేరగాడు అతడికి వలవేశాడు. తక్కువ రేటుకే సిమెంట్ ఇస్తానని నమ్మబలికాడు. డబ్బులు బదిలీ చేసి చిరునామా పంపిస్తే వెంటనే డెలివరీ ప్రాసెస్ మొదలవుతుందని చెప్పాడు. అలా ఆన్‌లైన్‌లో ఉండగానే రూ.5లక్షల20వేలు బదిలీ చేయించుకున్నాడు. నగదు బదిలీ అవగానే ఫోన్ కట్ అయింది. మళ్లీ ఆ నెంబరుకు చేస్తుంటే అందుబాటులో లేదని వచ్చింది. దీంతో కాంట్రాక్టర్ లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులను నమ్మి మోసపోవద్దని, నగదు బదిలీ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ తెలిపారు.

అల్లవరం మండలంలో వరుసగా సైబర్ మోసాలు



అల్లవరంలో సీబీఐ అధికారిని అంటూ వాట్సాప్ కాల్‌లోకి వచ్చి మోసగించిన వ్యక్తి చిత్రం

- సీబీఐ అధికారిని అని బెదిరించి డబ్బులు వసూలు
- రూ.85వేలు నష్టపోయిన ఓ ఉపాధ్యాయురాలు
- మరో ఇద్దరికీ బెదిరింపు కాల్స్

అల్లవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలో ఐదురోజులుగా సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. సీబీఐ అధికారిని అని వీడియో కాల్ ద్వారా బెదిరించి ఓ ఉపాధ్యాయురాలి నుంచి ఏకంగా రూ.85వేలు కాజేశారు. మరో ఇద్దరికి ఫోన్ చేసి డబ్బులు లాగే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. రెండురోజుల క్రితం ఇదే మండలంలోని దేవగుప్తం గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయురాలికి ఫోన్ చేసి మీ కుమారుడు గంజాయి కేసులో అరెస్టు అయ్యాడని రూ.లక్ష ఫోన్‌పే చేయాలని బెదిరించగా ఆమె రూ.85వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించి మోసపోయింది. ఇదే గ్రామంలో కిరాణా వ్యాపారి చిట్టూరి రామకృష్ణకు కూడా ఫోన్ చేసి మీ వీడియోలు మా దగ్గర ఉన్నాయి. అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశాం రమ్మని బెదిరించారు. బుధవారం వాసర్ల లక్ష్మణరావు అనే వ్యక్తికి ఫోన్ చేసి మీ అబ్బాయిని అరెస్టు చేస్తామని బెదిరించగా సదరు వ్యక్తి గట్టిగా సమాధానం చెప్పడంతో లైన్ కట్ చేశాడు. సైబర్ నేరాలు పెరిగిపోతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ జి.హరీష్ కుమార్ చెప్పారు. ఇలాంటి కాల్స్‌వస్తే నెంబర్లు సేకరించి స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సింగ్ పేరుతో సీబీఐ అధికారి అని బెదిరించిన వ్యక్తి ఫొటోలను బాధితులు సేకరించారు.


భూ ప్రకంపనలు



తెలంగాణలోని ములుగు కేంద్రంగా వచ్చిన భూకంప కేంద్రం

- తెలంగాణ రాష్ట్రం ములుగు కేంద్రంగా స్వల్ప భూకంపం
- ఏజెన్సీలోని విలీన మండలాల్లోను భూ ప్రకంపనల ప్రభావం
- ఉలిక్కిపడిన ప్రజలు
- కూనవరంలో పగిలిన ఇంటి గోడలు
- వీఆర్‌పురంలోను గోడకు బీటలు

కూనవరం/చింతూరు/ఎటపాక, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ములుగు కేంద్రంగా వచ్చిన భూకంపం ప్రభావంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విలీన మండలాల్లో పలుచోట్ల భూప్రకంపనలు కనిపించాయి. కూనవరం మండలంలో బుధవారం స్వల్పంగా భూమి కంపించింది. సరిగ్గా ఉదయం 7.20-7.30 గంటల మధ్య భూప్రకంపనలు రావడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రెండుసెకన్ల పాటు ఈ భూకంపం వచ్చింది. దీంతో మండలంలో టేకులబోరు గ్రామానికి చెందిన బండారు సాయికుమార్ ఇంటి గోడలు బీటలు వారాయి. కూనవరంలోని కాశీ అనే వ్యక్తి ఇంట్లో కొబ్బరిచెట్టుకు ఉన్న ఎండిపోయిన కొబ్బరిబొండాలు ఒక్కసారిగా నేలరాలాయి. చింతూరు, ఎటపాకల్లోను బుధవారం ఉదయం 7.27 గంటలకు రెండు, మూడు సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ఈ ప్రాంతవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భూకంపానికి ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు.



కూనవరం మండలం టేకులబోరులో భూకంపానికి బీటలు వారిన ఇంటిగోడలు

వీఆర్‌పురంలో స్వల్ప భూకంపం

వీఆర్‌పురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీఆర్‌పురం, వడ్డిగూడెం, రేఖపల్లి గ్రామాల్లో స్వల్ప భూకంపం వచ్చింది. బుధవారం ఉదయం 7.25 గంటల సమయంలో స్వల్ప భూకంపం రావడంతో రేఖపల్లి ఆర్‌ఎంపీ వైద్యుడు నాగేంద్రబాబు ఇంట్లో కొద్దిగా శబ్ధం రావడంతో భయాందోళన చెందారు. ఆ తర్వాత చూస్తే ఇంట్లో గోడలు స్వల్పంగా బీటలు వారాయి. వీఆర్‌పురంలోని పిట్టా వెంకన్న(వీఆర్‌వో) మంచంపై కూర్చున్న సమయంలో ఆ మంచం కదలడం, వడ్డిగూడెంలోను కుర్చీలు బల్లలు, ఇంట్లోని సామాన్లు రెండు, మూడు సెకన్లు కదిలాయని వారు తెలిపారు. దీంతో స్థానికులు భూకంపం వచ్చిందని భయాందోళన చెందారు.



రేఖపల్లిలోని ఓఇంట్లో బీటలు వారిన గోడ

గోకవరంలోను స్వల్పంగా..

గోకవరం, డిసెంబరు 4: గోకవరంలోను బుధవారం ఉదయం స్వల్ప భూప్రకంపన సంభవించినట్లు స్థానికులు చెప్తున్నారు. ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లో ఉదయం 7.30 గంటల సమయంలో మూడు సెకన్ల పాటు భూమి కంపించిందని, ఆ సమయంలో ఇంట్లోని వస్తువులు ఊగిసలాడడంతో తామంతా ఆశ్చర్యానికి గురయ్యామని, ఆ తర్వాత ఆందోళన చెందామని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని పలువురు సోషల్ మీడియా ద్వారా తమ పంచుకున్నారు.

కాకినాడలో నేటి నుంచి.. ప్లాస్టిక్ సర్జరీపై సదస్సు

- మూడురోజులపాటు సెమినార్లు.. వైద్యవిదార్థులకు అవగాహన తరగతులు
- హాజరుకానున్న దేశవ్యాప్త ప్లాస్టిక్, ఈస్థటిక్, కాస్మొటిక్ వైద్యనిపుణులు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్ రీకనస్ట్రక్టివ్ అండ్ సర్జన్ ఆఫ్ ఏపీ, తెలంగాణా ఆధ్వర్యంలో ఈనెల 5, 6, 7వ తేదీల్లో మూడురోజులపాటు కాకినాడ జీజీహెచ్‌లో సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్ డాక్టర్ డీవీ కృష్ణారావు, సెక్రటరీ డాక్టర్ రత్నభూషణ్ తెలిపారు. ప్లాసిక్ సర్జరీ, ఈస్థటిక్, కాస్మొటిక్ సర్జరీల ప్రాముఖ్యత సమాజంలో ఎంతో ఉందో తెలియజేయడం ఈ సెమినార్ల ముఖ్య ఉద్దేశమన్నారు. జీజీహెచ్ ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆధ్వర్యంలో దేశంలో ఉన్న ప్రముఖ ప్లాస్టిక్, ఈస్థటిక్, కాస్మొటిక్ వైద్యనిపుణుల ఆధ్వర్యంలో వైద్యవిద్యార్థులు, పీజీలకు గురువారం అవగాహన కల్పిస్తారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలు, అల్సర్ పుండ్లు లోపల సరిచేసేందుకు ప్లాస్టిక్ సర్జరీ, మారిన ప్రజల అభిరుచులు, జీవనశైలితో బాహ్య సౌందర్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ముఖంపై ముడతలు, అందంతో ఈస్థటిక్, కాస్మొటిక్ సర్జరీలపై ప్రదర్శనాత్మకంగా మృతి చెందిన శరీరాలను ఉపయోగించి అవగాహన కల్పిస్తారన్నారు. 5న జీజీహెచ్‌లో, 6, 7వ తేదీల్లో కాకినాడ కుళాయిచెరువు రాజాట్యాంకులోని పేబీన్ కన్వెన్షన్ హాల్లో ఈ సెమినారు నిర్వహిస్తారన్నారు. ఈ సెమినార్‌లో పాల్గొనేందుకు రీసోర్సుపర్సన్లుగా దేశంలోని ప్లాస్టిక్, ఈస్థటిక్, కాస్మొటిక్ రంగాల్లో నిష్ణాతులైన వైద్యనిపుణులు పూణె, కోల్‌కత్తా, హైదరాబాద్, ముంబాయి, ఢిల్లీ, నాగపూర్, కర్నాటక, తమిళనాడునుంచి విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఉస్మానియా వైద్యనిపుణులు సీనియర్ డాక్టర్ డాక్టర్ వెంకటరాఘవరెడ్డి, డాక్టర్ విష్ణుమూర్తి విచ్చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ శశి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ లావణ్యకుమారి, డాక్టర్ డీవీ కృష్ణారావు

స్టేట్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లకు యువకుడి ఎంపిక



పడాల వంశీనారాయణ

పి.గన్నవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): 2024-25 సీజన్‌లో అండర్-23 పురుషుల ఇంటర్ స్టేట్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరానికి చెందిన పడాల వంశీనారాయణ ఎంపికయ్యాడు. అండర్-23 పురుషుల ఇంటర్ స్టేట్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌కు ప్రాతినిధ్యం వహించడానికి ఈనెల 2న వైజాగ్‌లో ఐదుగురు సభ్యులతో టీమ్ ఎంపికలు నిర్వహించారు. ఏపీ జట్టుకు 17మందిని ఎంపిక చేయగా వారిలో ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి వంశీనారాయణ ఒకరు. ఈనెల 13 నుంచి జార్ఖండ్‌లో జరగనున్న ఇంటర్ స్టేట్ వన్డే క్రికెట్ మ్యాచ్‌ల్లో అతడు పాల్గొనే అవకాశం ఉంది. ఈ సందర్భంగా వంశీనారాయణకు తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, నాగలక్ష్మిలతోపాటు తూర్పుగోదావరి క్రికెట్ అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ, రఫీ, కోనసీమ క్రికెట్ కోచ్‌లు సత్తిబాబు, నగేష్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడి అరెస్ట్

పి.గన్నవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక ప్రాథమిక పాఠశాలవద్ద విద్యార్థులపై లైగింక వేధింపులకు పాల్పడ్డ కీచక ఉపాధ్యాయుడు పిండి శ్రీనివాస్‌కు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ ఘటనలో ఉపాధ్యాయుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచారయత్నం మూడు సెక్షన్లు కింద ఏఎస్‌ఐ పట్టాభిరామయ్య కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. డీఎస్పీ వైగోవిందరావు విచారణ నిర్వహించి ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారన్నారు. కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారని, దర్యాప్తు కొనసాగుతుందని ఎస్‌ఐ తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఆర్టీసీ డ్రైవర్ లోవరాజు

- దేవర సినిమా పాటకు డ్యాన్స్ వేసి సస్పెండ్ అయిన డ్రైవర్
- మంత్రి చొరవతో సస్పెన్షన్ రద్దు
- కుటుంబంతో సహా మంత్రిని కలిసి కృతజ్ఞతలు

తుని రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను తుని ఆర్టీసీ డిపోకు చెందిన బస్ డ్రైవర్ లోవరాజు మంగళగిరి క్యాంపు కార్యాయంలో బుధవారం కలిశారు. ఇటీవల దేవర సినిమాపాటకు బస్సు ముందు డ్యాన్స్ వేసి ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం.. తదనంతరం డిపో అధికారులు డ్రైవర్‌ను సస్పెండ్ చేయడం తెలిసిందే. మంత్రి లోకేశ్ చొరవతో సస్పెన్షన్ రద్దు చేయగా అతడు యథావిధిగా ఉద్యోగంలో చేరాడు. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ స్వయంగా ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేసి డ్రైవర్ టాలెంట్‌పై ప్రశంసలు కురిపించారు. దీంతో లోవరాజు కుటుంబసభ్యులతో కలిసి మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అతడు ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న డ్రైవర్ల గోడు తెలిపాడు. తమ కుటుంబం ఆర్థికంగా వెనుకబడినదని, సొంత ఇళ్లు కూడా లేదని మంత్రికి చెప్పాడు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందిస్తూ డ్రైవర్లను అన్ని విధాలా ఆదుకుంటామని, సొంతిళ్ల ఏర్పాటుకు చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. డ్రైవర్ వెంట తొండంగి మండలం ఒంటిమామిడి సర్పంచ్ అంగుళూరి సుధాకర్ ఉన్నారు.



మంత్రి లోకేశ్‌తో ఆర్టీసీ డ్రైవర్ లోవరాజు, అతని కుటుంబసభ్యులు

కోళ్లఫారంలో 1836 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ఉండ్రాజవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలో కోళ్లఫారంలో బుధవారం రేషన్‌బియ్యం నిల్వలు గుర్తించి సీజ్ చేసినట్టు కొవ్వూరు డివిజన్ అసిస్టెంట్ సివిల్ సప్లయిస్ అధికారి ఎం.నాగాంజనేయులు తెలిపారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు వేలివెన్ను గ్రామం మునిపల్లి రోడ్డులో ఉన్న జోగిరాజు కోళ్ల ఫారంలో తనిఖీలు చేయగా 34 ప్లాస్టిక్ బ్యాగ్‌లలో 1836 కేజీల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. వీటి విలువ రూ.79,866 ఉంటుందన్నారు. కోళ్లఫారం యజమాని మంతెన సుబ్బారావుపై నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈతనిఖీల్లో ఉండ్రాజవరం సీఎస్ డీటీ సుధీర్, వీఆర్వోలు మురళి, ఏసుపాదం, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.



వేలివెన్నులో రేషన్‌బియ్యం పట్టుకున్న అధికారులు

ఉరివేసుకుని ఒడిశా యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఒకసారి ఉరివేసుకుంటుంటే తోటి సిబ్బంది ఆపడంతో వారి దృష్టిమరల్చి రెండోసారి ఉరేసుకుని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దేచర్లలోని త్రివేణి ఫ్యాక్టరీలో ఒడిశా రాష్ట్రం కాంతిమిల్లి దినకన్లై జిల్లా బాదముండా కాంతిమిలి గ్రామానికి చెందిన చందన్ బెహెరా(19) వంట మాస్టర్‌కి అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కొవ్వూరు రాధాకృష్ణ హైస్కూల్ సమీపంలోని ఓ అపార్టుమెంటులో నివాసం ఉంటున్నాడు. చందన్ బెహెరాతోపాటు అపార్టుమెంట్‌లో అసిస్టెంట్ దుష్యంతు, ఒక ఆడిటర్ ఉంటున్నారు. మాస్టర్ చెఫ్ మూడు రోజుల కిందట ఊరు వెళ్లాడు. చందన్ బెహెరా మూడురోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఈనెల 3వతేదీ అర్ధరాత్రి హాలులో ఉన్న ఫ్యాన్‌కు అతడు ఉరివేసుకోవడానికి ప్రయత్నించగా దుష్యంతు, ఆడిటర్ చూసి ఆపి అతడిని సముదాయించారు. దీంతో అతడు పక్కగదిలోకి వెళ్లి పడుకుంటానని తలుపులు వేసుకున్నాడు. మిగిలిన ఇద్దరు మరో రూమ్‌లో పడుకున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు తలుపులు కొట్టగా ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి తలుపులు తెరవగా రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు దుప్పటితో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. త్రివేణి రేణుబుల్స్ ప్రైవేటు లిమిటెడ్ సీనియర్ మేనేజర్ సంతోష్ సాహూ అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ సాంబమూర్తి తెలిపారు.



ఫ్యాన్‌కు ఉరివేసుకున్న ఒడిశా యువకుడు

'పెందుర్తి'కి కేబినెట్ హోదా



వెంకటేష్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం
- తొలిసారిగా రాజానగరానికి కేబినెట్ ర్యాంకు
- సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఉన్న పెందుర్తి వెంకటేశ్
- ఆనందోత్సాహాల్లో టీడీపీ శ్రేణులు

రాజానగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శాసనసభా నియోజకవర్గాల పునర్విభజన అనంతరం దశాబ్దంన్నర కాలం తర్వాత రాజానగరం నియోజకవర్గానికి తొలిసారి కేబినెట్ హోదా లభించింది. టీడీపీకి కంచుకోటగా ముద్రపడ్డ రాజానగరం నియోజకవర్గానికి కూటమి ప్రభుత్వ హయాంలో ఈ హోదా లభించడంతో పార్టీశ్రేణుల్లో హర్షాతిరేకాలు మిన్నంటాయి. సీఎం చంద్రబాబు కార్యక్రమ నిర్వహణ కోఆర్డినేటర్‌గా ఉన్న రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌కు ప్రభుత్వం కేబినెట్ హోదా ర్యాంకు కల్పించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. సీఎం చంద్రబాబు కార్యక్రమాలను పెందుర్తి పర్యవేక్షిస్తారు. ఎన్నికల ముందు నుంచి ఆయన ఈ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరానికి చెందిన పెందుర్తి వెంకటేష్ సతీమణి అన్నపూర్ణ అప్పటి బూరుగుపూడి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం చెందారు. ఆ తర్వాత పార్టీతోనే కలిసి నడిచారు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజనతో ఏర్పడ్డ రాజానగరం నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు 2009, 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019 ఎన్నికల అనంతరం దాదాపు మూడేళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగిన పెందుర్తి పార్టీ అంతర్గత వ్యవహారాలతో మనస్తాపం చెంది ఆ పదవి నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. అయినా చంద్రబాబు జిల్లా పర్యటనలకు వచ్చిన ప్రతిసారి అధినేత వెంట నడిచారు. ప్రస్తుత రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరిని టీడీపీ రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా అధిష్ఠానం నియమించడంలో వెంకటేష్ కీలకంగా వ్యహరించారు. అనంతరం రాజానగరం నియోజకవర్గంలో పర్యటించిన బీవీఆర్ చౌదరి నియోజకవర్గంలో పెందుర్తి పట్టుసడల్లేదని అధిష్ఠానానికి నివేదించినట్టు తెలిసింది. ఇక 2024 ఎన్నికల సమయంలో పొత్తు కారణంగా రాజానగరం నియోజకవర్గం జనసేనకు కేటాయించడంతో బత్తుల బలరామకృష్ణ అభ్యర్థి అయ్యారు. ఆయన విజయం సాధించడంలో బీవీఆర్ చౌదరి, పెందుర్తి అహర్నిశలు శ్రమించారు. పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న వెంకటేష్‌ను గుర్తించి ఎన్నికలకు ముందే తన పర్యటన కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను అప్పగించారు. ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్న పెందుర్తికి కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో పార్టీశ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పార్టీ పరంగా కేబినెట్ ర్యాంకు లభించిన మొట్టమొదటి వ్యక్తిగా వెంకటేష్ నిలిచారు. ఈ సందర్భంగా ఆయన్ను టీడీపీ మండల నాయకులు దాసరి శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి ఖండవిల్లి లక్ష్మి, నాయకులు మల్లారపు సత్యానందం, మింగి లక్ష్మీనారాయణ, పి.శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కె.శామ్యూల్ కలిసి అభినందించారు.

రాజానగరానికి మూడు పదవులు

కూటమి ప్రభుత్వం రాజానగరం నియోజకవర్గంపై ప్రధాన దృష్టి కేంద్రీకరించింది. ఇప్పటికే మూడు పదవులు నియోజకవర్గాన్ని వరించాయి. సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన మునికోటేశ్వరరావును టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించారు. ఇటీవల రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరిని రుడా చైర్మన్‌గా ఎంపిక చేశారు. మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌కు కేబినెట్ హోదా కల్పిస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

గూడపల్లి సీఈవో ఆత్మహత్యాయత్నం

- జీతాల చెల్లింపులో ఆలస్యం, పని ఒత్తిడి కారణం అంటున్నారన్న ఎస్‌ఐ

మలికిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గూడపల్లి ప్రాథమిక సహకార సంఘం సీఈవోగా పనిచేస్తున్న నూకల వీరవెంకటసత్యనారాయణ బుధవారం తన ఇంట్లో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించినట్టు మలికిపురం ఎస్‌ఐ బి.సురేష్ తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగానే ఉందని, మూడు నెలలుగా జీతాలు లేకపోవడం, కార్యాలయంలో పని ఒత్తిడి పెరగడం వల్ల మాత్రలు మింగినట్టు తెలిపారని ఆయన చెప్పారు. రాజోలు డీసీసీబీ పరిధిలోకి వచ్చే గూడపల్లి పీఏసీఎస్‌కు మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతోపాటు డీసీసీబీ మేనేజర్ ఒత్తిడితో కంప్యూటరైజేషన్ పేరుతో పనిఒత్తిడి పెంచి మానసికంగా వేధిస్తున్నారని బాధితుడు సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాజోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడిని పలువురు సీఈవోలు, సిబ్బంది పరామర్శించారు. సత్యనారాయణ భార్య, కుమారుడు కూడా గతంలో మృతి చెందినట్టు తెలిసింది. గూడపల్లి సొసైటీ కంప్యూటరైజేషన్‌లో వెనుకబడి ఉందని, రికార్డులు సక్రమంగా లేవని, సెప్టెంబరు నెలలో జీతాలు తీసుకున్నారని, అక్టోబరు నెల జీతం మాత్రమే రావాల్సి ఉన్నట్టు కొందరు తెలిపారు. రైతులకు ఇచ్చే రుణాలపై కట్టే వడ్డీ నిధుల నుంచే జీతాలు తీసుకోవాలని బ్యాంకు మేనేజర్లు నిబంధన పెట్టడంతో సీఈవోలు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిసింది.



చికిత్స పొందుతున్న సత్యనారాయణ

మూడోసారీ.. నీటి సంఘాల ఎన్నికలు వాయిదా

- నిధులపై స్పష్టత కరువు
- అందుకేనా వాయిదా?

సామర్లకోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారులు సంఘాల ఎన్నికలు మూడోసారి వాయిదా వేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఆయా పదవులకు పోటీలో ఉందామని ఉవ్విళ్లూరిన కూటమి పార్టీల నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్టుగా ప్రభుత్వం ఆదేశాలు మారాయి. ముందుగా నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం ఈనెల 5న గురువారం ఎన్నికలకు స్థానికంగా అధికారులు నోటిఫికేషన్ ఇచ్చి 8న డబ్ల్యూయూఏలకు, 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఆ మేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకూ ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేయాలని మంగళవారం రాత్రి ప్రభుత్వం నుంచి కలెక్టర్ కార్యాలయానికి మౌఖికంగా సమాచారం అందగా ఉత్తర్వులు బుధవారం నాటికి అందాయి. దీంతో ఇప్పటివరకూ చేసిన ప్రక్రియను అధికారులు తాత్కాలికంగా ఆపేశారు. కాగా కూటమి వచ్చి నీటిసంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించాక ఇలా వాయిదా పడడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తొలుత ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఇచ్చినపుడు వరదలు, భారీవర్షాల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. రెండోసారి షెడ్యూల్ ఇచ్చినపుడు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కీలకమైన ఈ ఎన్నికలపై ఎమ్మెల్యేల దృష్టి సారించే అవకాశాలు ఉండవని భావించి వాయిదా వేశారు. మూడోసారి షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ నెల 5న నోటిఫికేషన్ ఇవ్వాల్సిఉండగా మరోసారి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి మంగళవారం రాత్రి బాగా పొద్దుపోయాక జిల్లా అధికారులకు అమరావతి నుంచి సమాచారం అందించారు. మూడోసారి ఈ ఎన్నికలను ఎందుకు వాయిదా వేశారో అధికారులకే కాదు.. నాయకులకు సైతం అర్థంకాక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

అధికారులకు తప్పిన భారం

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ జలవనరులశాఖ అధికారులకు సమస్యగా మారింది. నోటిఫికేషన్ దశకు వచ్చేవరకూ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వంనుంచి విడుదలకాక అధికారులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొన్నారు. స్థానికంగా జలవనరుల శాఖ పరిధిలో నిధులు అందుబాటులో లేవు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ ఎలా అనేది అర్థంకాక సతమతమవు తున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు అందిన సమాచారంతో అధికారులు ఊపిరి తీసుకున్నారు. ఈ ఎన్నికలను రెవెన్యూ, జలవనరుల శాఖలకు చెందిన అధికారుల భాగస్వామ్యంతో నిర్వహించాలి. సాగునీటి సంఘాలు, వాటి పరిధిలోని నీటివనరులు, ఆస్తులు అన్నీ జలవనరుల శాఖకు చెందినవే కాగా కేవలం ఎన్నికల ప్రక్రియ వరకే రెవెన్యూశాఖ భాగస్వామ్యం ఉంటుంది. దీంతో ఆ ప్రక్రియ అంతా జలవనరుల శాఖ అధికారులే చూడాల్సి ఉంది. నిధులు అందుబాటులో లేకపోవడమేకాక సిబ్బంది కొరత ఉండడంతో ఆ శాఖ అధికారులు ఆందోళన చెందారు. దీంతో వాయిదాతో తాత్కాలికంగా వారికి ఊరట కలిగింది. ఎన్నికలు వాయిదా వేసే వరకూ నిధుల విడుదల ఊసెత్తి లేకపోవడం గమనార్హం.

తూరంగేశ్వరస్వామి ఆదాయం లెక్కింపు

కాకినాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం తూరంగిలోని తూరంగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం కాకినాడ దేవదాయ ధర్మదాయశాఖ తనిఖీదారుడు ఆధ్వర్యంలో లెక్కించినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 51 రోజులకుగానూ 2 హుండీలను లెక్కించగా రూ.1,86,085 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ సజావుగా నిర్వహించాలి

కాకినాడ ఆర్డీవో మల్లిబాబు

పోలింగ్ సిబ్బందికి సూచనలు





కాకినాడలో పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో, పెద్దాపురంలో పోలింగ్‌కు బస్సుల్లో వెళుతున్న సిబ్బంది

కాకినాడ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రమైన స్థానిక మెక్లారిన్ హైస్కూల్ గదులను బుధవారం పరిశీలించిన ఆర్డీవో పోలింగ్ సిబ్బందికి సూచనలు చేశారు. కాకినాడ డివిజన్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 11 పోలింగ్ కేంద్రాలు, సుమారు 2519 మంది ఉపాధ్యా ఓటర్లు ఉన్నారన్నారు. ఈ నెల 5న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కాకినాడ డివిజన్‌లో 10 మండలాలకు సంబంధించి 4 రూటలను, ఎన్నికల విధి నిర్వహణ సిబ్బందిని, రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధి నిర్వహణ సిబ్బంది, పోలీసు బందోబస్తు మధ్య మెటీరియల్‌ను పోలింగ్ కేంద్రాలకు సురక్షితంగా తరలించడం జరిగిందన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు సిబ్బంది సహరించాలని కోరారు. ఈ పరిశీలనలో ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి జీఆర్ ఠాగూర్, ఉప గణంకాధికారి రమణమూర్తి, డిప్యూటీ తహసిల్దార్లు రామ్‌కుమార్, కృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

పెద్దాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పోలింగ్ సిబ్బందికి సామాగ్రి పంపిణీ చేసే ప్రక్రియను ఆమె పరిశీలించారు. పెద్దాపురం డివిజన్ పరిధిలో ఉన్న 11 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందించిన అనంతరం వారికి కేటాయించిన ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. పెద్దాపురం డివిజన్ పరిధిలోని 899 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరుగుతుందన్నారు. రూట్ 1లో పెద్దాపురం, గండేపల్లి, జగ్గంపేట, ఏలేశ్వరం, రూట్ 2లో తొండంగి, తుని, కోటనందూరు, రూట్ 3లో కిర్లంపూడి, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి పోలింగ్ కేంద్రాలకు వాహనాలు పంపడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ జరిగేలా సహకరించాలని ఆమె కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

పిఠాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పిఠాపురం తహశీల్దారు కార్యాలయంలో పోలింగ్ కేంద్రంలో 210 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల సామగ్రితో పోలింగ్ సిబ్బంది బుధవారం తహశీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 64మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కార్యాలయంలోని మీటింగ్‌హాలులో ఈ కేంద్రం ఏర్పాటు చేశారు. పోలింగ్ కోసం విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

షష్ఠి ఉత్సవాలకు విస్తృత బందోబస్తు

అడిషనల్ ఎస్పీ



తాటిపర్తిలో క్యూలైన్లు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ భాస్కరరావు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి ఉత్సవాలకు విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లోని స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలను ఆయన బుధవారం రాత్రి సందర్శించారు. ఈ నెల 7 నుంచి జరిగే ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లపై పరిశీలన చేశారు. క్యూలైన్లు పటిష్టంగా ఉండాలని సూచించారు. భక్తులు 6న రాత్రి నుంచి వచ్చే అవకాశం ఉన్నందున వారికి తగు ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీసులను నియమిస్తామని తెలిపారు. బాణసంచా సామగ్రి కాల్చే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ, తాటిపర్తి ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కుంపట్ల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

క్రియ పిల్లల పండుగ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూకే ఈనెల 28,29వ తేదీల్లో జరిగే 11వ రాష్ట్ర అంతర పాఠశాలల క్రియ పిల్లల పండుగ పోస్టర్‌ని బుధవారం వలసపాకల గంగరాజునగర్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పంతం నానాజీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా చిన్నపిల్లల కోసం నిర్వహిస్తున్న క్రియ పిల్లల పండుగ కార్యక్రమం విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్నారుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు క్రియ పండుగ ఎంతగానో దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో పుల్ల శ్రీరాములు, క్రియ పిల్లల పండుగ ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.

భజన సమాజం సభ్యులకు శిక్షణా తరగతులు

పిఠాపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం పి.తిమ్మాపురంలోని ధర్మ ప్రచార భజన శిక్షణ సంస్థ అధ్యక్షుడు, భజన గురువు పి.ధర్మరాజు ఆధ్వర్యంలో పి.దొంతమూరు జైహనుమాన్ భజన సమాజం సభ్యులకు 60రోజులు పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు ముగిశాయి. 50కీర్తనలు ఆలాపనలో శిక్షణ పొందారు. అనంతరం భజన గురువులను, ప్రోత్సహకులు కీర్తి నాగ సత్యనారాయణ తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు తటవర్తి సుబ్బారావు, కేవీఎస్ఎన్ ప్రసాద్, భజన బృందం అధ్యక్షురాలు రాసంశెట్టి దుర్గాలక్ష్మీ, కార్యదర్శి కుంచం ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

పిఠాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పారా లీగల్ వాలంటీర్లుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి తెలిపారు. 18 ఏళ్ల నిండి పదోతరగతి కనీస విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈనెల 21వ తేదిలోగా తమ దరఖాస్తులను పిఠాపురం న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్‌మీట్

కాకినాడఅర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి); కాకినాడ డీఎస్ఏ మైదానంలో బుధవారం నారాయణ పాఠశాలల కాకినాడ జోన్ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఏజీఎం రాఘవేంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నారాయణ ఈ చాంప్స్ ఆర్‌అండ్‌డీ అర్చన, జోనల్ కో ఆర్డినేటర్ రామతులసి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సఫూర, ప్రియ, షర్మిల, కవిత, రవికిషోర్, చక్రదర్, నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ యజమానుల నిరసన

కాకినాడ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమను మాఫియాగా చిత్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడం తగదని, అలా చేయడం వల్ల బ్రతుకు తెరువు కోల్పోయే పరిస్థితి ఉందని కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివారావు, కార్యదర్శి అల్లం రాజు, కోశాధికారి గణేశుల వాసు పేర్కొన్నారు. ఈ దుష్ప్రచారాన్ని ఖండిస్తూ బుధవారం స్థానిక సంజయ్‌నగర్‌లోని అసోసియేషన్ కార్యాలయం వద్ద లారీ యజమానులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతి నిధులు మానుకోవాలని శ్రీనివాసరావు, రాజు, వాసు తదితరులన్నారు.

తీరనున్న గొల్లప్రోలు ప్రజల కష్టాలు

జనవరి నుంచి రోజూ తాగునీటి సరఫరా

డిప్యూటీ సీఎం పవన్ చొరవతో

రూ.72.75లక్షలు మంజూరు



గొల్లప్రోలు పట్టణానికి తాగునీరు అందించే బోర్ల వద్ద పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

గొల్లప్రోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా గొల్లప్రోలు పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించనున్నది. ఇప్పటి వరకూ 3, 4రోజులకు ఒకసారి వచ్చే తాగునీటిని వచ్చే నెల నుంచి ప్రతి రోజూ అందించనున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో ఇందుకు నిధులు మంజూరు కావడంతో యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఉన్న సుమారు 30వేల మంది జనాభాకు, 4,750 కుటుంబాలకు ప్రస్తుతం 3, 4రోజులకు ఒకసారి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. దీంతో పట్టణ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు తెలియడంతో తన కార్యాలయం ఓఎస్‌డీ మధుసూదన్, ఇతర అధికారులను గొల్లప్రోలు పంపి పరిశీలన చేయించారు. పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారు ఇచ్చిన నివేదికపై పవన్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో మాట్లాడారు. గొల్లప్రోలు రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన ఫిల్టర్‌పాయింట్ల మార్పు, బోర్‌వెల్, పంపుసెట్లు, పైపులైన్ల ఏర్పాటు, మరమ్మతులు, నూతన మోటార్ల ఏర్పాటు తదితర అత్యవసరమైన 9 పనులకు రూ.72.75 లక్షలు మంజూరు చేయించారు. యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహించాలని పవన్ అధికారులను ఆదేశించారు. దీంతో నగరపంచాయతీ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో పనులు ప్రారంభమై చురుకుగా జరుగుతున్నాయి. ఈ నెలాఖరు నాటికి పనులు అన్నింటిని పూర్తి చేసి జనవరి మొదటి వారంలో పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించనున్నారు. తద్వారా దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కానున్నది. గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనరు రవికుమార్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

రైతులను అన్ని విధాల మోసం చేసిన వైసీపీ

మాజీ ఎమ్మెల్యే వర్మ



మాధవపురంలో ధాన్యం పరిశీలిస్తున్న వర్మ

పిఠాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులను అన్ని విధాల మోసం చేశారని, కనీసం వారు పండించిన పంటలు కొనకుండా, కొన్నా నెలల తరబడి సొమ్ములు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం, మాధవపురం ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించి ధాన్యం రాశులను పరిశీలించి సేకరణ ఎలా జరుగుతుందో రైతులను ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో 26.70లక్షల ధాన్యం బస్తాలను సేకరించాల్సి ఉండగా ఇప్పటికే 30శాతాన్ని ప్రభుత్వం సేకరించిందని,పిఠాపురం నియోజకవర్గంలో 35శాతంపైగా రైతు సేవా కేంద్రాల ద్వారా కొనడం జరిగిందన్నారు. 48గంటల వ్యవధిలోనే కూటమి ప్రభుత్వం రైతుల ఖాతాలకు సొమ్ములు జమచేసిందని తెలిపారు. అదే వైసీపీ సమయంలో రైతుల వద్ద ధాన్యం కొనకుండా ఇక్కట్లు పాలు చేసిందని విమర్శించారు. నాడు ఆర్బీకేలు దళారులకు నెలవుగా మారాయని, వైసీపీ నేతలు రైతుల సొమ్ములు దోచుకున్నారని ఆరోపించారు. రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంటే జగన్, వైసీపీ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే వాస్తవాలు తెలుస్తాయని హితవు పలికారు. టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్ పాల్గొన్నారు.

'హిందువుల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ కల్పించాలి'

కాకినాడ సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లోని మైనారిటీ హిందువుల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ కల్పించేలా, ఇస్కాన్ ధర్మాచార్యులను వెంటనే జైలు నుంచి విడిపించేలా అంతర్జాతీయ సమాజం ద్వారా ఒత్తిడి తేవాలని భారత ప్రభుత్వాన్ని కోరుతూ బంగ్లాదేశ్ హిందూ రక్షా వేదిక ఆధ్వర్యంలో బుధవారం కాకినాడలో నిరసన ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లోని హిందువుల, ఇతర మైనారిటీల మానవ హక్కులను, మత విశ్వాసాలను పరిరక్షించాలని, హిందువుల ధన, మాన, ప్రాణాలను కాపాడాలని నినాదాలతో హోరెత్తించారు. రాష్ట్రపతికి విన్నవించుకుంటూ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. హిందూ రక్షా వేదిక నాయకులు మాట్లాడుతూ గడచిన 4 నెలలుగా బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అకృత్యాలు, దాడులకు అంతులేకుండాపోయిందన్నారు. ఆ దేశ అంతర్గత రాజకీయ పరిణామాలు పరోక్షంగా మన దేశ ప్రజల మనోభావాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. హిందూ రక్షావేదిక నాయకులు గట్టి సత్యనారాయణ, అప్పాజీ, తుమ్మల పద్మజ, పట్నాయక్, బిక్కిన రాజు, సూర్యనారాయణరాజు ఉన్నారు.

వాలుతిమ్మాపురంలో 'పొలం పిలుస్తోంది'

పెద్దాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలుతిమ్మాపురం గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలు స్తోంది కార్యక్రమం బుధవారం మండల వ్యవ సాయాధికారి కొమ్మోజు సంజయ్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. ప్రస్తుత వాతవరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటను జాగ్రత్త చేసుకోవాలన్నారు. కుప్పలు వేసిన రైతులు వాటిపై బరకాలు కప్పుకోవాలన్నారు. తడిసిన పనలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పశువైద్యాధికారిణి అన్నపూర్ణ, ఏఈవో రాగ స్రవంతి, వీపీఏ మల్లిక, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడలో టీ షాపు దగ్ధం

కొత్తపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉప్పాడలో సురేష్ శారీస్ షోరూమ్ పక్కన నిర్వహిస్తున్న టీ ట్రెండ్ షాపులో బుధవారం గ్యాస్ బండ పేలి సుమారు రూ.3లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఫర్నీచర్, ఫ్రిజ్, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. సాయంత్రం సమయంలో టీ తయారుచేస్తుండగా ఆకస్మాత్తుగా గ్యాస్ బండ పేలడంతో మంటలు చుట్టుముట్టడంతో షాపు నిర్వాహకుడు సత్తిబాబు భయపడి బయటు పరుగులు తీశాడు. స్థానికులు పిఠాపురం అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. వారు మంటలను అదుపు చేశారు. టీషాప్ అతి దగ్గర్లో ఉప్పాడ జాంధానీ చీరల షోరూమ్‌లు ఉన్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదంతప్పిందనిస్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

విద్యుత్ స్తంభం నుంచి జారిపడి వ్యక్తి మృతి

కాకినాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం చీడిగలో కోట శ్రీనివాసరావు(33) విద్యుత్‌స్తంభం పై నుంచి కిందకు దిగుతుండగా నిచ్చెన మెట్లు జారడంతో ఒకేసారి కిందపడి మృతిచెందిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు వివరాల ప్రకారం.. శ్రీనివాసరావు సంబంధిత గ్రామ లైన్‌మెన్ వద్ద పనిచేసేవాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచామని, మృతుడి తండ్రి శంకరరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఘంటసాల

ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ పద్మశ్రీ, మాజీ మంత్రి చిక్కాల



ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

కాకినాడ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్ని తరాలు గడిచినా తెలుగు ప్రజల హృదయాల్లో ఘంటసాల ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉంటారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ నారాయణ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పేర్కొన్నారు. గాన గంధర్వ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు బుధవారం అల్లూరి సీతారామరాజు స్మారక కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జవహర్‌వీధిలో ఘంటసాల కాంశ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి కళావేదిక అధ్యక్షుడు కర్రి అప్పు తరామారెడ్డి అధ్యక్షత వహించగా గౌరవ అధ్య క్షుడు వుండవల్లి రంగారావు, ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు స్వాగతం పలికారు. ముఖ్యఅతిథులు నానాజీ, పద్మశ్రీ, చిక్కాల మాట్లాడుతూ ఘంటసాల పాడిన నమో:వెంకటేశ పాట చరిత్రలో చిరస్థాయిగా ఉంటుందన్నారు. ప్రాంతాల వారీ భావోద్వేగాలపై పాడిన పాటలు వచ్చే తరానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. సినీ సంగీత విభావరిలో గాయకులు పాడిన ఘంటసాల పాటలు అలరించాయి. కార్యక్రమంలో ఘంటసాల కోడలు సూర్యకుమారి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజలక్ష్మి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాసిరెడ్డి ఏసుదాసు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వై మాలకొండయ్య, టీడీపీ జిల్లా కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, మాజీ కార్పొరేటర్ ఎస్ లక్ష్మీప్రసన్న కళావేదిక ప్రతినిధులు కర్రి భామారెడ్డి, ఎస్‌వీవీ ఎస్ఎన్ మూర్తి, ఎస్‌వీఆర్ బాపిరాజు, టీవీవీ ఎస్ఎన్ రెడ్డి, ఉంగరాల వెంకటేశ్వరరావు, తురగా సూర్యారావు, రమణయ్యరాజు పాల్గొన్నారు.

రైల్వే యూనియన్ గుర్తింపు ఎన్నికలు

సామర్లకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషిచేసే యూనియన్ గుర్తింపు ఎన్నికలు పురస్కరించుకుని సామర్లకోట బ్రాంచి పరిధిలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీరు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన పోలింగ్‌బూత్‌లో మొదటి రోజైన బుధవారం సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి ఒక బూత్‌లో 265 ఓట్లు, రెండవ బూత్‌లో 138 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 747 మంది ఓటర్లు ఉన్నట్లు, గురువారం రోజు కూడా పోలింగ్ కొనసాగుతుందని సామర్లకోట బ్రాంచి సంఘ్ కార్యదర్శి ఎం.రమేష్ చెప్పారు. పోలింగ్ బూత్‌ల వద్ద సామర్లకోట రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సామర్లకోట బ్రిడ్జిపై ట్రాఫిక్ స్తంభన



సామర్లకోట ఓవర్‌బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన వాహనాలు

సామర్లకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిపై సాంకేతికలోపం కారణంగా రోడ్డుకు అవరోధంగా నిలిచిపోవడంతో బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకూ సుమారు గంటన్నరకు పైబడి వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. సామర్లకోట-కాకినాడ రోడ్డు, సామర్లకోట-బిక్కవోలు రోడ్డు, పెద్దాపురం ఏడీబీ రోడ్డులు పూర్తిగా వాహనాలతో ప్రజలు తప్పించుకునే వీలులేక ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. సెంటర్లోనే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఉన్నప్పటికీ ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు గంటతర్వాత చేరుకోవడంతో ట్రాఫిక్ పోలీసులపై పలువురు వాహనదారులు తీవ్రంగా మండిపడ్డారు. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం వల్ల వారంలో రెండు రోజుల పాటు ట్రాఫిక్ స్తంభించిపోతుందని తరచూ పోలీసులు వైఫల్యం చెందుతున్నారని పలువురు ఆరోపించారు. జిల్లా పోలీసలు ఉన్నతాధికారులు సత్వరం చర్యలు తీసుకుని ట్రాఫిక్ తరచూ నిలిచిపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా పరాక్ రాష్ట్రీయ నాస్ పరీక్ష

సామర్లకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పరాక్ రాష్ట్రీయ సర్వేక్షన్ వారిచే జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న నాస్ పోటీపరీక్ష సామర్లకోటలో బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పీ.పుల్లయ్య పర్యవేక్షణలో నాస్ పరీక్ష మూడోవతరగతికి గాను 2 పరీక్షా కేంద్రాల్లో 42మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరోతరగతికి చెందిన 30 మంది, తొమ్మిదవ తరగతికి చెందిన 86మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలుగా సామర్లకోట గౌతమ్ స్కూల్, వేట్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఉండూరు ఏడీబీ రోడ్డు లక్ష్య ఇంటర్‌నేషనల్ విద్యా సంస్థలను నిర్వహించినట్లు చెప్పారు. కోర్ సబ్జెక్టులలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు నాస్ పరీక్ష దోహదపడుతుందని చెప్పారు.

పుష్ప2 సినిమా పోస్టర్ల చించివేత



పిఠాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో పుష్ప-2 సినిమా పోస్టర్ల చించివేత కలకలం సృష్టిస్తోంది. ప్రముఖ హీరో అల్లు అర్జున్ నటించిన పుష్ప-2 సినిమాను గురువారం పిఠాపురంలో 4 థియేటర్లల్లో విడుదల నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో పుష్ప సినిమా పోస్ట ర్లను అంటించారు. వాటిని బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. ఉదయమే ఈ విషయం వెలుగుచూడడంతో కలకలం రేగింది. మెగాఫ్యాన్స్, అల్లు అర్జున్ ఫ్యాన్స్ మధ్య కొంతకాలంగా సోషల్‌మీడియాలో వార్ నడుస్తోంది. ఇటువంటి తరుణంలో పవన్ ఎమ్మెల్యేగా ఉన్న పిఠాపురంలో ఈ సంఘటన జరగడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై తమకు ఏ ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసరావుకు శాప్ ఛైర్మన్ అభినందన



శ్రీనివాసరావును అభినందిస్తున్న శాప్ ఛైర్మన్ రవి నాయుడు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల పంజాబ్‌లో జరిగిన 31వ ఆలిండియన్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ 2024 ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించిన శ్రీనివాసరావును శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అభినందించారు. విజయవాడ శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడుని కాకినాడ ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసరావు కలిశారు. రవినాయుడు శ్రీనివాసరావును అభినందిస్తూ శాప్ నుంచి పూర్తి సహాయసహకారం అందిస్తామని హామీఇచ్చారు. అలాగే కాకినాడ ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు, డిపో మేనేజర్ మనోహర్, సీఐ బాలకృష్ణ తదితరులుఅభినందనలు తెలిపారు.

పొన్నాడ వ్యవసాయ సహాయకుడు మృతి



రాజేష్(ఫైల్)

కొత్తపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొన్నాడ వ్యవసాయ సహాయకుడు వెలిగెట్ల రాజేష్(23) బుధవారం మృతి చెందారు. సుమారు నెల రోజుల కిందట ఆరోగ్యం బాగోక వైద్యపరీక్షలు చేయిం చుకున్న రాజేష్‌కు కాన్సర్ వ్యాధి సోకిందని వైద్యులు ధ్రువీకరించారు. అప్పటి నుంచి విశాఖపట్నంలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారని రాజేష్ కుటుంబసభ్యులు తెలిపారు. రాజేష్ మృతికి కొత్త పల్లి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం సిబ్బంది, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది తీవ్ర సంతాపం తెలియజేశారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడికి గాయాలు

కరప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరప మండలం పాతర్లగడ్డ ప్రధాన రహదారి పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కాజులూరు గ్రామానికి చెందిన కంపసత్తి సురేష్ బుధవారం సామర్లకోట మండలం మాధవపట్నంలో కోళ్లను కొనుగోలు చేసి మోటర్‌సైకిల్‌పై స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యాడు. పాతర్లగడ్డ వచ్చేసరికి సడన్‌గా రోడ్డుపక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని కిందపడిపోయాడు. సురేష్ తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు రక్తం కారకుండా కట్టు కట్టి సపర్యలు చేశారు. అటుగా వెళ్తున్న వీఆర్‌వో మేడిశెట్టి కిషోర్‌కుమార్ బాధితుడి బంధువులకు, 108కు ఫోన్ చేసి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కరప పోలీసులు కేసు నమోదుచేశారు.

రోశయ్యకు నివాళి

పిఠాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా పిఠాపురంలో చిత్రపటానికి టీడీపీ ఆర్యవైశ్య సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, కేతవరపు కృష్ణ నివాళులు అర్పించారు.

వృద్ధులకు అన్నదానం

ప్రత్తిపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని పాదాలమ్మ తల్లి ఆలయ సమీపంలో గల శారదా వయోవృద్ధ శరణాలయంలోని వృద్ధులకు బుధవారం ఏలేశ్వరం నగర పంచాయతీ 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి సతీష్‌గోవిందబాబు అన్నదానం నిర్వహించారు. ఆయన తన జన్మదినాన్ని పురస్కరించుకుని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు షైరాల నాగేశ్వరరావుతో కలిసి ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. గోవింద్‌కు వృద్ధులు జన్మదిన శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గిరిజన సంక్షేమ శాఖలో...

అక్రమ డిప్యూటేషన్లు రద్దు

» ఐటీడీఏ పీవో సూచనతో డిప్యూటీ డైరెక్టర్ ఉత్తర్వులు

రంపచోడవరం,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఇటీవల చేపట్టిన అక్రమ డిప్యూటేషన్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశాలతో రద్దయ్యాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగా డీడీ కార్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండానే డిప్యూటేషన్లు చేపట్టడం వివాదంగా మారింది. దీంతో ఎన్నికల కమిషన్‌తోపాటు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులుఅందడం, ఈ వ్యవహారం మీడియాలో అల్లరి కావడంతో ఐటీడీఏ పీవో తక్షణం స్పందించారు. ఆయన ఆదేశాలతో 11 డిప్యూటేషన్లను రద్దుచేస్తూ గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ తిరిగి ఉత్తర్వులు జారీచేశారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు



సామగ్రితో తరలివెళ్తున్న సిబ్బందితో సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికను రంపచోడవరం, చిం తూరు డివిజన్లలో ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. రంపచోడవరం నుంచి ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించే సందర్భంలో ఎన్నికల నిర్వహణ అంశాలను బుధవారం ఆమె మీడియాకు వివరించారు. ఈ రెండు డివిజన్లలో 637మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, వీరికోసం 11 మండలాల్లో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 103మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారని, పోలింగ్ కేంద్రాలవద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను రంపచోడవరంలోని రిసెప్షన్ సెంటర్‌కు తరలించాలని, అక్కడి నుంచి వాటిని పటిష్ట భద్రత నడుమ కాకినాడ జేఎన్టీయూలోని మెయిన్ సెంటరుకు తరలిస్తామన్నారు. చింతూరు డివిజన్‌లో ఎన్నికల ఏర్పాట్లను అక్కడి ప్రాజెక్టు అధికారి అపూర్వభరత్ పర్యవేక్షిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం తహసీల్దారు రామకృష్ణ పాల్గొన్నారు.

కొండరెడ్లకు వెదురు అల్లికలపై శిక్షణ: ఐటీడీఏ పీవో



చింతూరు వారాంతపు సంతలో వెదురు అల్లికలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ అపూర్వభరత్, అమరావతి బృందం

చింతూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చింతూరు కేంద్రంగా కొండరెడ్లకు వెదురు అల్లికలపై ప్రత్యేక శిక్షణ ఇప్పించనున్నట్లు ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్ అన్నారు. పీవోతోపాటు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ బృందం బుధవారం చింతూరు వారాంతపు సంతతోపాటు కూనవరం మండలం, టేకులొద్దిలో పర్యటించారు. ఈ రెండు ప్రదేశాల్లో కొండరెడ్లు తయారు చేసిన వెదురు అల్లికలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ అమరావతి బృందంతో మాట్లాడుతూ చింతూరు కేంద్రంగా వెదురు అల్లికలపై ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆ మేరకు నాణ్యమైన వెదురు సరఫరా చేయించడంతోపాటు అత్యాధునిక యంత్రాలను సమకూర్చనున్నట్లు పీవో పేర్కొన్నారు. శిక్షణ చింతూరు డివిజన్ కేంద్రగా వెదురు అల్లికల ఔత్సాహికులందరికీ అవకాశం కల్పిస్తామన్నారు.

గిరిజన విద్యార్థినుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



గురుకుల విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

» రంపచోడవరంలో గురుకుల బాలికల విద్యాలయాల్ని పరిశీలించిన ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్ని గిరిజన సంక్షేమ విద్యాలయాల్లో విద్యార్థినుల ఆరోగ్యంపై ఎటువంటి నిర్లక్ష్యం తగదని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పిలుపునిచ్చారు. రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ బాలికల విద్యాలయాలను బుధవారం ఆమె పరిశీలించారు. గురుకుల కళాశాల, గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాల వసతిగృహాలను ఆమె పరిశీలించి అక్కడి విద్యార్థినులతో మాట్లాడారు. వారికి అందుతున్న సౌకర్యాలు, ఆహారం, వైద్యసేవలు, వసతి తదితర అంశాలను పరిశీలించి ఆయా విద్యాలయాల ప్రిన్సిపాళ్లతోను, వార్డెన్లతోను ఆమె సమావేశమయ్యారు. ప్రభుత్వం ఈ విద్యాలయాలకోసం ఎంతో చిత్తశుద్ధితో పథ కాలను, నిధులను సమకూర్చుతోందని, వాటిని సక్రమంగా విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత విద్యాలయాల నిర్వాహకులపై ఉందన్నారు. అనారోగ్య సమస్యలు వచ్చినపుడు తక్షణం సమీప ఆస్పత్రులకు తరలించడంలో నిర్లక్ష్యాన్ని కనబర్చవద్దన్నారు. నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని, పరిసరాల పరిశుభ్రత సక్రమంగా ఉండాలని, మరుగుదొడ్ల నిర్వహణ కూడా సక్రమంగా ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆమెతోపాటు టీడీపీ నాయకుడు సలాది బాపిరాజు ఉన్నారు.

ఎమ్మెల్సీ అక్రమ చెరువులపై విచారణ జరపాలి: సీపీఎం



రంపచోడవరంలో సమావేశమైన సీపీఎం ప్రాంతీయ కమిటీ

రంపచోడవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ నిర్వహిస్తున్న అక్రమ చెరువులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం మండలాల ప్రాంతీయ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన ఎమ్మెల్సీ అనంతబాబు అడ్డతీగల మండలంలో సాగిస్తున్న అక్రమాలపై తీవ్రంగా స్పందించారు. మన్యంలోని అధికారులు ఈ అంశాన్ని పట్టనట్టే వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంలో అధికారులు స్పందించకుంటే తామే ఉద్యమం చేపడతామన్నారు. మద్దిగడ్డ జలాశయం నీటిని కూడా ఆయన చెరువులకు మళ్లిస్తున్నారన్నారు. బాధ్యులైన వారిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి బి.కిరణ్, జిల్లా నాయకురాలు మట్ల వాణిశ్రీ, నాయకులు ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి, తీగల శ్రీను, రాజన్నదొర, వెంకటరెడ్డి, గంగిరెడ్డి, సంకు రుదొర పాల్గొన్నారు.

సీపీఎం చింతూరు మండల కార్యదర్శిగా పల్లపు వెంకట్



చింతూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీపీఎం చింతూరు మండల కార్యదర్శిగా పల్లపు వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కల్లేరులో మంగళ, బుధవారం రెండురోజులపాటు జరిగిన పార్టీ మండల తొమ్మిదో మహాసభలో భాగంగా ఈ ఎన్నిక జరిగింది. విద్యార్థి దశ నుంచే వెంకట్ పలు ఉద్యమాల్లో పాలు పంచుకున్నారు. తర్వాత కార్మిక నాయకుడిగా చిరుద్యోగుల సమస్యలపై గళం విప్పుతూ వచ్చారు. వెంకట్‌తోపాటు సీసం సురేష్, మల్లం సుబ్బమ్మ, మొట్టుంరాజయ్య, పొడియం లక్ష్మణ్ కార్యదర్శివర్గ సభ్యులుగా ఎంపికయ్యారు. వీరితోపాటు కమిటీ సభ్యులుగా ఎర్రంశెట్టి శ్రీనివాస్, ముర్రం రంగమ్మ, సవలం కన్నయ్యకమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



జగ్గంపేట: రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్య నాయకులు



అన్నవరం: పేదలకు అన్నదానం, వస్త్ర దానం చేస్తున్న పేరూరి గాంధీ

'చిరస్మరణీయుడు మాజీ ముఖ్యమంత్రి రోశయ్య'

జగ్గంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), జగ్గంపేట ఎం పీపీ అత్తులూరి నాగబాబులు రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో బొండా నూకరాజు, కొత్త శివరామకృష్ణ, బొండా వీర సత్యనారాయణ మూర్తి, మానేపల్లి వీర్రాజు గుప్తా, వి.శివరామ మూర్తి, బొండాడ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం,(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతి సందర్భంగా బుధవారం అన్నవరం వాసవీ నిత్యాన్న సత్రం ఆధ్వర్యంలో ఆయనకు నివాళులర్పించారు. పేదలు, వృద్ధులకు అన్నదానం, వస్త్రదానం చేసినట్టు సత్రం అధ్యక్షుడు పేరూరి గాంధీ పేర్కొన్నారు. కార్యదర్శి రేపాక రామసత్యనారాయణ, కోశాధికారి తల్లం సత్యారావు, బొలిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా సాగులో మెళకువలు పాటించాలి



రైతులకు అపరాల విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు, శాస్త్రవేత్త శర్మ

ప్రత్తిపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దాళ్వా వరి సాగులో అధిక దిగుబడుల సాధనకు రైతులు మెళకువలు పాటించాలని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ పేర్కొన్నారు. మండలంలోని వాకపల్లి గ్రామంలో దాళ్వా సాగు చేపట్టే చేలను, కోత దశలో ఉన్న వరి చేలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి వైవీ గంగాధర్‌లతో కలిసి రైతులకు సబ్సిడీపై మినుము విత్తనాలు పంపిణీ చేశారు. దాళ్వాలో సాగు చేయాల్సిన వరి రకాలు, జాగ్రత్తలు, అపరాల సాగు, కోతులు, అడవి పందుల దాడి నుంచి పంట సంరక్షణకు చేపట్టాల్సిన అంశాలను శాస్త్రవేత్త శర్మ వివరించారు. ఏవో గంగాధర్ మాట్లాడుతూ టీబీఎస్ 8 రకం మినుము విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయన్నారు. టీడీపీ నాయకుడు కురందాస్ అప్పలరాజు, వ్యవసాయ సహాయకులు రామలక్ష్మి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



జగన్‌ను కలిసిన గిరిబాబు

ప్రత్తిపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డిని బుధవారం మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఆయన తనయుడు, ప్రత్తిపాడు వైసీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట ధర్మవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు చెక్కపల్లి సత్తిబాబు ఉన్నారు.

'స్వర్ణ పంచాయతీ' కార్యక్రమంలో

అన్నవరం ముందంజ

అన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ ఆదేశాలతో అన్నవరం పంచాయతీ ముందంజలో ఉందని కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి పేర్కొన్నారు. 3,263 అసెస్‌మెంట్‌ల నమోదుకు గాను రెండు రోజుల్లో 2,004 నమోదు చేశామని, మిగిలిన వాటిని గురువారం పూర్తి చేస్తామన్నారు. పంచాయతీ పరిధిలో ఇంటి పన్నులు, అసెస్‌మెంట్‌లు పారదర్శకంగా ఉండేందుకు డేటా ఎంట్రీ చేస్తున్నామని, ప్రజల వివరాలు అందుబాటులో ఉంటా యన్నారు. సర్వర్ ఇబ్బందులున్నా అదనపు పని గంటలతో ఇది సాధ్యమైందని చక్రవర్తి చెప్పారు.

ఎమ్మెల్యే జ్యోతుల పరామర్శ

గండేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెడ్.రాగంపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కందుల కొండయ్య చౌదరి (బాబ్జీ) తల్లి సూర్యకాంతం ఇటీవల మృతిచెందారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం బాబ్జీ ఇంటికి వెళ్లి సూర్యకాంతం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. నెహ్రూ వెంట టీడీపీ గండేపల్లి, జగ్గంపేట మండల శాఖల అధ్యక్షులు పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, జడ్.రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, రిటైర్డు ఎంఈవో ఉదయభాస్కర్‌చౌదరి, కందుల వినయ్, ఉండవల్లి వరప్రసాద్ వున్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

ఎటపాక, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం నెల్లిపాక జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో బ్రహ్మాజీరావు బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, టీచర్స్ డైరీలు, లెసెన్ ప్లాన్స్, హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ క్రమంలో డీఈవో పదో తరగతి విద్యార్థుల విద్యాబోధన, ప్రమాణాల సామర్థ్యంపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి పరీక్షించారు. పదో తరగతి విద్యార్థుల వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై విద్యార్థులతో చర్చించారు. బోధనలు సరళీకృతం చేసి పది ఫలితాల్లో నూరు శాతం ఫలితాలు వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ఆవరణలో చేపడుతున్న నాబార్డు నిర్మాణాల పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. పాఠశాలలో అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ఇద్దరు ఉపాధ్యా యులపై తీరు అసహనం వ్యక్తం చేసి వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.

పెన్షనర్లు జీవిత కాల ధ్రువపత్రాలు అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్లు

ప్రత్తిపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సబ్ ట్రెజరీ పరిధిలోని పెన్షనర్లు తమ జీవిత ధ్రువపత్రాలను జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోగా అందజేయాలని సబ్ ట్రెజరీ అధికారి ఖాన్ కోరారు. స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో బుధవారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టీవో ఖాన్ మాట్లాడుతూ ఫిబ్రవరి నెలాఖరులోగా లైఫ్ ధ్రువపత్రాలు అందజేయని పెన్షనర్ల పెన్షన్‌ను మార్చి నుంచి నిలిపివేస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో ద్వారా 135 నెలలు పూర్తయిన పెన్షనర్ల వద్ద నుంచి రికవరీ చేసిన కమ్యూటేషన్ సొమ్ము ఈ నెల నుంచి వారి ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. సమావేశంలో పెన్షనర్ల సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం, చుక్క నాగేశ్వరరావు, జంజం సుబ్బారావు, రాము, ఉమామహేశ్వరరావు, అనపర్తి భాను, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాలకు చెందిన పెన్షనర్లు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలకు రాట ముహూర్తం



రాట ముహూర్తం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

శంఖవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడిలో ఈ నెల 7 నుంచి తొమ్మిది రోజుల పాటు శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ పూజారి మేమకోటి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఏడాది స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని, భక్తులు వచ్చి దర్శించుకోవాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ కేశంగి నూకరాజు, ఎంపీటీసీ జీలకర్ర విష్ణు, మాదేపల్లి మహేష్, జీలకర్ర త్రిమూర్తులు, జీలకర్ర లక్ష్మణరావు, కేశంగి సతీష్, కోటిలింక రాంబాబు, ఓరుగంటి పెద్దకాపు, ఓరుగంటి శివ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

తొండంగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర ప్రాంత పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా జి.జాన్, కార్యదర్శిగా ఎం.శ్యామ్‌సుందర్, కోశాధికారిగా కె.స్టీఫెన్, ఉపాధ్యక్షునిగా సీహెచ్ దానియేలు, సంయుక్త కార్యదర్శిగా సీమోను, సంయుక్త కోశాధికారిగా ఎస్.జయరాజు ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా ప్రేమ్‌కుమార్, మణికర్, డేవిడ్‌రాజు, రాజేష్, డి.కృపారావు తదితరులు ఎన్నికయ్యారు. కార్యవర్గ ప్రమాణస్వీకారానికి సప్తగిరి హేచరీస్ అధినేత పెదబాబు, కొయ్యా శ్రీనుబాబు, చొక్కా కాశీశ్వర్రావు, యాదాల రాజబాబు హాజరయ్యారు.

'కారణజన్ముడు ఘంటసాల'



ఘంటసాల చిత్రపటానికి నివాళులు

ఏలేశ్వరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తన గానంతో అందరినీ ఓలలాడించిన ఘంటసాల కారణజన్ముడని ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు ఆలమూరి సుబ్బారావు అన్నారు. బుధవారం ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా లింగంపర్తిలో ఆయన చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. మాటూరి సూరిబాబు, చెదల వీరబాబు, వల్లమరెడ్డి కొండయ్య, వాగు బాబులు, కప్పల వెంకటస్వామి, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు సూర్యప్రభ

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

ప్రత్తిపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని తహసీల్దారు ఎం.సూర్యప్రభ, ఏవో పుణ్యవతి బుధవారం పరిశీలించారు. గురువారం ఈ కేంద్రంలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ముందు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు.

'ఆదిత్య'లో న్యాయ సదస్సు

గండేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఐసీసీ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ సదస్సు నిర్వహించారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మహిళల హక్కులు, రక్షణ విధానాలపై అవగాహన పెంచడమే లక్ష్యంగా సదస్సు నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పెద్దాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.హర్షవర్ధన్ న్యాయపరమైన సాధికారత, రాజ్యాంగ అంశాల ప్రాముఖ్యతను వివరించారు.



పెళ్లి కానుక చెక్ అందజేత

గండేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన మంగిన అంజలి వివాహం సందర్భంగా జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా రూ.20 వేలు పెళ్లి కానుక చెక్‌ను బుధవారం టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పోతుల మోహనరావు, యర్రంశెట్టి వెంకటలక్ష్మీబాబ్జి, పోకల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కొండబాబుకు సత్కారం

అన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొత్త కొండబాబును బుధవారం అన్నవరం ఆర్యవైశ్య సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. సంఘం అధ్యక్షుడు దాసరి నగేష్, గణపతి, ప్రసాద్, గణి, జయవరపు విహారి తదితరులు పాల్గొన్నారు.



'ఫోరెన్సిక్ మ్యాగజైన్' ఆవిష్కరణ

గండేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఫోరెన్సిక్ సైన్స్ కాలేజీ రూపొందించిన భారతదేశపు మొట్టమొదటి ఫోరెన్సిక్ సైన్స్ ఆధారిత ద్వైమాసిక ఫోరెన్సిక్స్ మ్యాగజైన్ మూడవ సంచికను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు బుధవారం ఆవిష్కరించారు. ఫోరెన్సిక్‌పై అవగాహన పెంపొందించడంలో మ్యాగజైన్ కీలక పాత్రను హైలెట్ చేస్తూ డీఎస్పీ అభినందించారు. ఈ కొత్త సంచిక మునుపటి సంచికలకు వచ్చిన స్పందనను అనుసరిస్తోందని ప్రిన్సిపాల్ విలాస్ అనిల్‌చవాన్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, హెచ్‌వోడీ ఉదయనాథ్, దర్శన్ మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

శంఖవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) రోజురోజుకూ తగ్గుతున్న ఉష్ణోగ్రతల కారణంగా హాస్టల్ విద్యార్థులు చలితో తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకున్న కలెక్టరు షాన్‌మోహన్ విద్యార్థులకు దుప్పట్లు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సహకారంతో కేజీబీవీ విద్యార్థినులు 263 మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. దీంతో చిన్నారులు ఆనందం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

జగ్గంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాహితి పబ్లిక్ స్కూల్లో సైబర్ క్రైం, మహిళా రక్షక్ అవగాహన సదస్సును సీఐ వైఆర్కే శ్రీనివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. మత్తు పదార్థాలు, మత్తు పానీయాల జోలికి వెళ్లకూడన్నారు. ఈవ్‌టీజింగ్, క్రికెట్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్ జోలికి పోవద్దన్నారు. సాహితీ పబ్లిక్ స్కూల్ అధినేత డి.కృష్ణవర్మ, జగ్గంపేట ఎస్ఐ రఘునందన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం ప్రాంతీయ కన్వీనర్‌గా వాణిశ్రీ

రంపచోడవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి మండలాల ప్రాంతీయ కమిటీ కన్వీనర్‌గా మట్ల వాణిశ్రీ నియామకమయ్యారు. బుధవారం ఇక్కడ జరిగిన ప్రాంతీయ కమిటీ సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. వాణిశ్రీ కన్వీ నర్‌గా తీగల శ్రీనివాస్, ఈతపల్లి సత్యనా రాయణ రెడ్డి, రాజన్నదొర, కత్తుల గంగరెడ్డి, చామంతి సభ్యులుగా ఈకమిటీ ఏర్పాటైంది.